

అది గొడ్డలి పార్టీ అనడానికి ఇవిగో 11 నిదర్శనాలు..

# అఖండ భూమి

AKANDA BHOOMI TELUGU DAILY

ఎడిటర్ : యం. ఈశ్వరయ్య — సంచలన దినపత్రిక



నన్ను తెలివి తక్కువ వాడు అనొద్దు.. కావాలంటే అలా అనండి..!

పచురణ: కర్నూలు,ఆంధ్రప్రదేశ్ సంపుటి : 04 సంచిక : 87 ఎడిటర్ : ఎం ఈశ్వరయ్య పేజిలు : 08, ఆదివారం 24-05-2026 సెల్ : 9440912389, 9490315559 వెల రూ. 2 రూ/

Published From kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kurnool,

## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి



- మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు
- అమెరికా రావాలని ఆహ్వానం
- నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ
- యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం

నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్-అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే.

- మిగతా 2 లో

## హైదరాబాద్‌లో టెస్లా షోరూం


- తెలంగాణ ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు
- హైదరాబాద్‌లో సేల్స్, సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయనున్న టెస్లా
- మంత్రి శ్రీధర్‌బాబుతో టెస్లా ఉన్నతాధికారుల ఉన్నత స్థాయి భేటీ
- తెలంగాణను గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వం
- అనుబంధ పరిశ్రమలపైనా దృష్టి సారించాలని టెస్లాకు మంత్రి సూచన
- పెట్టుబడులకు పూర్తిస్థాయి సహకారం అందిస్తామని ప్రభుత్వ హామీ




2 లో

## గగనతలం మూసివేసిన ఇరాన్.. మళ్లీ యుద్ధ భయం?

- ఇరాన్‌పై కొత్తగా సైనిక దాడులు చేసేందుకు అమెరికా యోచిస్తోందని కథనాలు
- అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గగనతలాన్ని పూర్తిగా మూసివేసిన ఇరాన్
- ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో తీవ్రమవుతున్న ఉద్రిక్తతలు
- ప్రభుత్వ బాధ్యతల కారణంగా సొంత కుమారుడి వివాహానికి దూరంగా ఉంటున్నట్లు తెలిపిన ట్రంప్



అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై 'కొత్త దాడులు' చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది.సీబీఎస్ న్యూస్ కథనం ప్రకారం రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. అయితే, దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా ఆ కథనం పేర్కొంది.

- మిగతా 2 లో



2 లో

## దేశంలో 40 శాతం ఫేక్ న్యాయవాదులే!

- నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తింపు
- డిగ్రీల వెరిఫికేషన్‌కు లాయర్లు దూరంగా ఉన్నట్లు బీసీఐ వెల్లడి
- ఈ ఉదంతాన్ని సీజేఐ దృష్టికి తీసుకెళ్లిన బీసీఐ
- లాయర్ల డిగ్రీలపై సీబీఐ విచారణకు సీజేఐ యోచన

## నింద నుంచి తప్పించుకునేందుకే శాంతిదూత ముసుగు ధరించాడు




- బీజేపీ ఎంపీ సీఎం రమేష్
- పయ్యావుల కేశవ్ తో కలిసి సీఎం రమేష్ ప్రెస్ మీట్
- మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు
- శాంతిదూత ముసుగు వేసుకుని జగన్ కొత్త నాటకానికి తెరలేపారని వ్యాఖ్యలు
- జగన్ తాత రాజారెడ్డిపై అధికారికంగా రౌడీ షీట్ ఉందని వెల్లడి
- వివేకా హత్యపై ఓపెన్ పోల్ పెడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

వైసీపీ అధినేత జగన్ ఒక నటుడు, క్రిమినల్ అని, ఇప్పుడు హఠాత్తుగా శాంతిదూత ముసుగు వేసుకుని ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ఒక

- మిగతా 2 లో

## ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఇంటినుంచే 74 రకాల వైద్య పరీక్షలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదు
- సీబీఎన్ దగ్గర తోక తిప్పితే, ప్రజాహితం కోసం తోక కట్ చేస్తా
- 'సంజీవని' కార్యక్రమం వైఎస్సార్సీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టిన సీఎం




ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 లోపే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని పథకం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం కంద్రిక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వైఎస్సార్సీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదన్నారు. "సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రప్పారప్పా రంకెలు, జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే, ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటు లేదని సీఎం అన్నారు."అభివృద్ధి సంక్షేమంతోపాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల

- మిగతా 2 లో



2 లో

## జనసేన విప్ పదవికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

- జనసేన విప్ పదవికి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా
- అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి రాజీనామా లేఖ అందజేత
- వ్యక్తిగత కారణాలతోనే తప్పుకుంటున్నట్లు ప్రకటన
- మహిళా ఉద్యోగి ఆరోపణల వివాదం నేపథ్యంలో ఈ పరిణామం

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు


- తెలంగాణ కేబినెట్ ఆమోదం
- కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం భేటీ
- తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ పచ్చజెండా
- జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న అంశాలపై చర్చ



గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది.కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయించింది. అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్,

- మిగతా 2 లో

## తెలంగాణలో భానుడి ఉగ్రరూపం వడదెబ్బతో 34 మంది మృతి



- తెలంగాణలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాలులు
- వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 34 మంది మృతి
- కుమ్రం భీం జిల్లాలో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 18 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ
- రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు

- మిగతా 2 లో

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్
- చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచన
- సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్ష

భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో

- మిగతా 2 లో

# సంపాదకీయం

## ‘తమిళ విజయం’ మనకు ఆదర్శం

ప్రజలు ఆలోచిస్తున్నారు కాబట్టి మార్పు మొదలవుతుంది. ఈ మాట తమిళనాడు రాజకీయాలలో నిజమైంది. అలాగే తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులకు అక్షరాలా సరిపోతుంది. ఎన్నికలయిన దాదాపుగా ప్రతిసారి అధికార మార్పిడి జరుగుతున్నది, కానీ పాలన మారడం లేదు. పార్టీలు మారుతున్నాయి, కానీ రాజకీయ సంస్కృతి మారడం లేదు. టీడీపీ, వైఎస్ఆర్సీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్-- పేర్లు వేరయినా ప్రజల్లో పెరుగుతున్న భావన ఒక్కటే... అవినీతి, కుటుంబాధిపత్యం, కాంట్రాక్టర్ రాజకీయం, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగం.ఒకప్పుడు సిద్ధాంతాల కోసం నడిచిన రాజకీయాలు ఇప్పుడు ఎన్నికల మేనేజ్‌మెంట్‌కు పరిమితమయ్యాయి. ప్రజా సమస్యల కంటే మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ ఇంజనీరింగ్, డబ్బు సమీకరణ, ఓటర్లకు పంపిణీ ప్రధాన అజెండాలుగా మారాయి. ఎన్నికలప్పుడు ప్రజలను గుర్తుచేసుకునే నాయకత్వం, తర్వాత కార్పొరేట్ వర్గాలకు దగ్గరవుతోందన్న అసంతృప్తి సామాన్యుల్లో ఉంది. బీజేపీ దక్షిణాదిలో స్థిరపడేందుకు ప్రయత్నిస్తోంది. కానీ ఉత్తర భారతంలో పనిచేసిన మత రాజకీయాలు ఇక్కడ పనిచేయడం లేదు. దక్షిణ భారత సమాజం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, భాషాభిమానం, సెక్యులర్ విలువలపై నిర్మితమైంది. ఇక్కడ ప్రజలు మత విద్వేషాల కంటే ఉద్యోగాలు, విద్య, వ్యవసాయం, ధరలు, జీవనోపాధి గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. అయినా బీజేపీ ఒకవైపు ప్రాంతీయ పార్టీలతో రాజీ రాజకీయాలు చేస్తూనే, మరోవైపు మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికి విస్తృత అవకాశం ఏర్పడుతోంది. అదే బీసీ, దళిత, ఆదివాసీ, ముస్లిం, బహుజన రాజకీయాలు. సంఖ్యలో మెజారిటీ అయిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు రాజకీయ అధికారంలో మాత్రం ఎందుకు మైనారిటీగా మిగిలిపోతున్నారు అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రవేశం ఈ ప్రశ్నకు ఒక కొత్త దిశ చూపించింది. రాజకీయ వారసత్వం లేకుండా, సంప్రదాయ మీడియా మద్దతు లేకుండా, డబ్బు పంచకుండా, కేవలం యువత నమ్మకంతో, క్లీన్ ఇమేజ్‌తో, సోషల్ మీడియా శక్తితో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించగలిగాడు. ఆయన గెలిచింది కేవలం ఓట్లు కాదు... ప్రజల నమ్మకం, అభిమానంతో పాటు మార్పు కోసం ఎదురుచూస్తున్న యువత ఆత్మగౌరవాన్ని. ఇది తెలుగు రాష్ట్రాల బహుజన యువతకు ఒక గొప్ప సంకేతం. “మనం కూడా చేయగలం... మనం కూడా గెలవగలం” అనే నమ్మకం కలిగించే ఉదాహరణ.బహుజన ఉద్యమం కేవలం కుల సంఘాల స్థాయిలో ఆగిపోకూడదు. అది ఆత్మగౌరవ ఉద్యమంగా మారాలి. బీసీలతో మొదలైన చైతన్యం ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువత, మహిళలు, అట్టడుగు వర్గాలందరినీ కలుపుకుంటూ విస్తరించాలి. “ఓటు మాది... సీటు మీదా?” అనే ప్రశ్న ప్రతి గ్రామంలో వినిపించాలి. ప్రజల హృదయాలను గెలుచుకోకుండా రాజకీయాలు గెలవలేమని అనడానికి తమిళనాడు ఉదాహరణ. డబ్బుతో కొన్ని ఓట్లు కొనవచ్చు. కానీ నమ్మకాన్ని కొనలేరు. నిజంగా డబ్బే ఎన్నికలను నిర్ణయిస్తే డబ్బున్నవాళ్లే శాశ్వతంగా అధికారంలో ఉండాలి. కానీ ప్రజాస్వామ్యంలో మార్పు జరుగుతూనే ఉంది. అంటే ప్రజలు ఇంకా ఆలోచిస్తున్నారు... ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఉద్యమానికి కేవలం ఆగ్రహం సరిపోదు. సిద్ధాంతం కావాలి. సామాజిక న్యాయం, సమానత్వం, సెక్యులరిజం, ఆత్మగౌరవం-- ఇవే పునాదులు కావాలి. అంబేడ్కర్, ఫూలే, పెరియార్, కాన్షీరాం వంటి మహానుభావుల ఆలోచనలు ఉద్యమానికి దిశానిర్దేశం చేయాలి. తెలంగాణలో సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, సమ్మక్క--సారలక్క, దొడ్డి కొమరయ్య వంటి పోరాట యోధుల వారసత్వం ఉద్యమానికి బలం కావాలి.ఇప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పూర్తిగా కార్పొరేట్ రాజకీయాల ప్రభావంలో ఉన్న కాలం. అందుకే సోషల్ మీడియానే కొత్త తరహా ఉద్యమాల ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి గ్రామంలో ప్రతి యువకుడు ఒక ప్రచారకర్త కావాలి. ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితేనే మార్పు సాధ్యమవుతుంది. ముఖ్యంగా, బహుజన రాజకీయాలు ద్వేష రాజకీయాలు కాకూడదు. ఆగ్రహం ఉండాలి కానీ, అసభ్యత కాదు. పోరాటం ఉండాలి కానీ, విద్వేషం కాదు. గౌరవంతో కూడిన రాజకీయ భాష ప్రజలను మరింత దగ్గర చేస్తుంది.తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. పాత రాజకీయాలపై విసుగు వచ్చింది. ఇదే సరైన సమయం. బహుజన శక్తులు గ్రామగ్రామాన తిరగాలి. ప్రతి స్థానంలో పోటీ చేయాలి. ప్రజల్లో నమ్మకం నింపాలి. అధికారాన్ని అడుక్కోవడం కాదు, సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలి. ఎందుకంటే బహుజన భావజాలం కేవలం ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కాదు, అది సామాజిక న్యాయ భారత నిర్మాణానికి మార్గం.

## గగనతలం మూసివేసిన ఇరాన్.. మళ్లీ యుద్ధ భయం?

**మొదటిపేజీ తరువాయి -** ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు.ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. “ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యం” అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీరతను తెలియజేస్తోంది.గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

## ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి

**మొదటిపేజీ తరువాయి -** మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా-భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండో-పసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి” అని పోస్ట్ చేశారు.ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ పేర్కొన్నారు.

## దేశంలో 40 శాతం ఫేక్ న్యాయవాదులే!

**మొదటిపేజీ తరువాయి -** దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీవారేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా.. దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు.సోషల్ మీడియాలో సంచలనంగా మారిన ‘కాక్రోచ్ జనతా పార్టీ’ ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన ‘కాక్రోచ్’ వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం


**మొదటిపేజీ తరువాయి -** ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు.సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. ముందుందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు




**మొదటిపేజీ తరువాయి -** సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్ స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.

# ఆగస్టు 15లోపు రాష్ట్రవ్యాప్తంగా సంజీవని




**మొదటిపేజీ తరువాయి -** మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు, తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు.తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి, పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది ఎన్డీయే కూటమి. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ తెలుగుజాతి ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఎదుగుతుంది” అని సీఎం చంద్రబాబు అన్నారు. “ప్రజల సంక్షేమ ంతోపాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. హోదా, కార్లు, డబ్బు ఎన్ని ఉన్నా, అన్నింటికి మించింది ఆరోగ్యం. సంజీవని పథకం కింద ఇంటినుంచే 74 రకాల వైద్య పరీక్షలు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఒక ఏఐ డాక్టర్ ఉంటారు. ఏదైనా జబ్బు చేస్తే, ఏఐ డాక్టర్‌ను సంప్రదించి ఇంటి నుంచే చికిత్స. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే మా లక్ష్యం. ఎన్టీఆర్ ఆరోగ్య పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచితవైద్యం. ప్రజల గురించి తప్ప, నాకు మరో ఆలోచన లేదు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటాం, ప్రకృతిని కాపాడుకోవాలి. రాయలసీమలో ప్రతి జిల్లాకు సాగునీరు ఇచ్చాం. హంద్రీనీవా నీరును చిత్తూరు జిల్లా వరకు తీసుకెళ్లాం. శ్రీశైలం జలాశయం నీటిని వెంకన్న సన్నిధి వరకు తీసుకెళ్తాం. 32 ప్రాజెక్టులను ఏరోజు ప్రారంభిస్తామో ముందే తేదీలు చెప్పాం. ఈ ఏడాది ఎల్‌నినో వల్ల వర్షాలు తక్కువగా పడతాయంటున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని జాగ్రత్తగా వినియోగించుకోవాలి. పుట్టపర్తికి జెట్ విమానాలు తయారయ్యే పరిశ్రమలు తీసుకొచ్చాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. రాయలసీమలో త్వరలోనే బంగారుగని ప్రారంభం కానుంది. దేశంలోనే అత్యధిక బంగారం ఉత్పత్తి కర్నూలులో జరగనుంది”.

## హైదరాబాద్‌లో టెస్లా షోరూం




**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా.. హైదరాబాద్‌లో అడుగుపెట్టనుంది. నగరంలో తమ సేల్స్, సర్వీస్ సెంటర్‌ను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో టెస్లా ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.టెస్లా బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్, ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్.. మంత్రి శ్రీధర్‌బాబుతో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించేందుకు, వీలైనంత త్వరగా విక్రయాలు ప్రారంభించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు వారు స్పష్టం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా నాలుగు షోరూమ్‌లను విజయవంతంగా ఏర్పాటు చేసిన టెస్లా, తమ తదుపరి ప్రతిష్ఠాత్మక కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టెస్లా నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికే విద్యుత్ వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీకి అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన బలమైన ఎకోసిస్టం ఉందని వివరించారు. సెమీకండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్, డీప్ టెక్నాలజీ వంటి రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. కేవలం కార్ల తయారీకే పరిమితం కాకుండా సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీ వంటి అనేక రంగాల్లో టెస్లా అగ్రగామిగా ఉందని మంత్రి కొనియాడారు.భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణహిత రవాణాను తమ ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను క్లీన్ టెక్నాలజీ, గ్లోబల్ మొబిలిటీకి ప్రపంచస్థాయి హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం షోరూమ్‌లకే పరిమితం కాకుండా తెలంగాణలో టెస్లా అనుబంధ పరిశ్రమల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు, పరిపాలనా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. దేశంలో ప్రస్తుతం కార్ల మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా కేవలం 4 శాతమేనని, ఈ రంగంలో వృద్ధికి అపార అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు శశాంక, నిఖిల్ చక్రవర్తి, రఘురామశర్మ, సాయికృష్ణ తదితరులు పాల్గొని టెస్లా విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. టెస్లా రాకతో తెలంగాణ ఆటోమొబైల్ రంగం అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## నింద నుంచి తప్పించుకునేందుకే శాంతిదూత ముసుగు ధరించాడు



**మొదటిపేజీ తరువాయి -** నేరస్తుడు అనే నింద జనాల్లోకి బలంగా వెళ్లిందని, ఇప్పుడా నింద నుంచి తప్పించుకునేందుకే జగన్ ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మంచి పనులు చేస్తే క్రిమినల్ ముద్ర పోతుంది కానీ, ప్రెస్ మీట్లలో పచ్చి అబద్ధాలు చెబితే పోదని హితవు పలికారు.ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ.. “కరడుగట్టిన నేరస్థులకు కూడా తట్టని కుట్రలు, కుతంత్రాలతో వైఎస్ కుటుంబం పులివెందులలో ఒక అరాచక సామ్రాజ్యాన్ని నిర్మించింది. జగన్ తాత రాజారెడ్డిపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పోలీస్ రికార్డుల్లో అధికారికంగా రౌడీ షీట్ నమోదైంది. ఒక కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించడం, ఒక మైనింగ్ యజమానిని దారుణంగా హత్య చేసి ఆ గనులను అక్రమంగా చేజిక్కించుకోవడం వంటి చర్యలతో రాజారెడ్డి డబ్బు కూడగట్టారు. పులివెందుల సమీపంలోని పార్నపల్లి గ్రామంలో ఆయన అరాచకాలకు నేటికీ సజీవ సాక్ష్యాలు ఉన్నాయి” అని ఆరోపించారు.తన రాజకీయ లబ్ధి కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిల మరణాలను జగన్ వేర్వేరుగా వాడుకుంటూ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సీఎం రమేష్ విమర్శించారు. “వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేసి వైఎస్ భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసింది. ఈ హత్య వెనుక జగన్ హస్తం ఉందా లేదా అనే అంశంపై రాష్ట్రంలో ఓపెన్ పోల్ నిర్వహించాలి. ఒకవేళ ఆ పోల్‌లో జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని తేలితే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా” అని సవాల్ విసిరారు.ప్రజలకు జగన్ హత్యా రాజకీయాలపై పూర్తి అవగాహన వచ్చిందని, అందుకే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడు తాను చాలా మంచివాడినని చెప్పుకుంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి మేధావులు కూడా పొంతన లేని వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో తమకున్న విశ్వసనీయతను పూర్తిగా కోల్పోతున్నారని సీఎం రమేష్ విమర్శించారు.

## జనసేన విప్ పదవికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా



**మొదటిపేజీ తరువాయి -** రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తన శాసన సభ విప్ పదవికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే శ్రీధర్ ఈ నిర్ణయం తీసుకున్నారని జనసేన పార్టీ ఓ అధికారిక ప్రకటనలో వెల్లడించింది.ఇటీవల అరవ శ్రీధర్‌పై రైల్వే కోడూరుకు చెందిన ఓ మహిళా ఉద్యోగి తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆయన కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ త్రిసభ్య కమిటీని కూడా నియమించారు. కమిటీ ముందు హాజరైన శ్రీధర్, ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు.అయితే, ఆరోపణలు చేసిన మహిళ ఇప్పటికీ సోషల్ మీడియా ద్వారా వీడియోలు విడుదల చేస్తూ తన వాదన వినిపిస్తున్నారు. ఈ వివాదం కొనసాగుతున్న తరుణంలోనే శ్రీధర్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తనపై వస్తున్న ఆరోపణలు, నెలకొన్న వివాదంపై పవన్ కల్యాణ్‌కు శ్రీధర్ వివరణ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ రాజీనామా ఆయన స్వయంగా చేశారా? లేక పార్టీ అధిష్ఠానం సూచన మేరకు జరిగిందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# తెలంగాణలో భానుడి ఉగ్రరూపం




**మొదటిపేజీ తరువాయి -** కోల్పోయారు. వాతావరణ శాఖ రాష్ట్రంలోని 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమవు తున్నారు.నిన్న రాష్ట్రంలోనే అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో 46.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, సూర్యాపేట సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీలుగా రికార్డయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46.2 నుంచి 46.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 244 మండలాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం కనిపించింది. సూర్యాపేట జిల్లాలోని 22 మండలాల్లో, మంచిర్యాల, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 18 చొప్పున మండలాల్లో వడగాలులు వీచాయి.సాధారణంగా సూర్యాస్తమయం తర్వాత వాతావరణం చల్లబడుతుంది. కానీ, గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో రాత్రిపూట కూడా వేడి సెగలు, ఉక్కపోత తగ్గడం లేదు. గురువారం రాత్రి హైదరాబాద్, హకీంపేట, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో సాధారణం కంటే 2.7 నుంచి 4.7 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు రాత్రుళ్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. ఈనెల 26 వరకు పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఏపీలో కాలుష్యరహితంగా గోదావరి పుష్కరాలు

**కుంభమేళా తరహాలో విస్తృత ఏర్పాట్లు**

**రాజమహేంద్రవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన ఖరారు**

**గోదావరి పుష్కరాల కోసం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పవన్ పరిశీలిస్తారన్న మంత్రి కందుల దుర్గేష్**



రాష్ట్రంలో గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించేలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. అందులో భాగంగా వచ్చే ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వినూత్న ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ కుంభమేళాలో అనుసరించిన విధానాన్ని ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు.తాజాగా గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా నేడు(శనివారం) ఏర్పాట్లను మంత్రి పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన ఏర్పాట్లు పరిశీలించారు.గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష : గోదావరి పరీవాహక ప్రాంతంలో కాలుష్య నిర్మూలన, పుష్కరాల నిర్వహణకు అవసరమైన చర్యలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రేపు(ఆదివారం) రాత్రి ఉపముఖ్యమంత్రి రాజమహేంద్రవరానికి చేరుకోనున్నారని, సోమవారం ఉదయం పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు బోటు ద్వారా వివిధ ఘాట్లను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు.అలాగే నల్లా ఛానల్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా పరిశీలించనున్నారని చెప్పారు. అనంతరం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.“రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం నాడు గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటిస్తారు. ఇక్కడ పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లు, అలాగే కాలుష్య రహితంగా నిర్వహించడం ఎలాగే అనే అంశాలను పరిశీలిస్తారు. రేపు రాత్రి పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరానికి చేరుకుంటారు. సోమవారం ఉదయం పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు బోటు ద్వారా వివిధ ఘాట్లను పరిశీలిస్తారు. అనంతరం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.10 కోట్ల మంది పుణ్యస్నానాలు : గోదావరి పుష్కరాలు వచ్చే సంవత్సరం జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరగనుండగా, వీటిలో కీలక రోజుల్లో (పీక్ డేస్) సగటున కోటి మంది చొప్పున పుష్కర స్నానాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలు మొదలయ్యే రోజు, చివరి రోజు, వారాంతాలైన శని, ఆదివారాలు, అమావాస్య రోజున సుమారు కోటి మంది చొప్పున భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు.ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా ఏర్పాటుచేసే ఘాట్లలో సుమారు 8 నుంచి 10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని అధికారులు లెక్కలు వేశారు. 2015వ సంవత్సరంలో జరిగిన పుష్కరాల్లో దాదాపు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారు. అత్యధికంగా 2015వ సంవత్సరం జులై 18న 58.26 లక్షలు, 19వ తేదీన 56.23 లక్షల మంది భక్తులు వచ్చారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యేక ఏర్పాట్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# ఘనంగా హైదరాబాద్ జోన్ 2 నారాయణ ప్రధానోపాధ్యాయుల సమావేశం...!




**ప్రతినిధి కురుపాటి గణేష్ హయత్ నగర్ మే 23 (అఖండ భూమి న్యూస్):** హైదరాబాద్ జోన్ 2 నారాయణ ప్రధానోపాధ్యాయుల సమావేశం హయాత్ నగర్ లో ఘనశీగా ఏర్పాటు చేయడం జరిగింది..ఈ సందర్భంగా వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఏర్పాటు గురించి చర్చిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అదేవిధంగా అకాడమిక్ సంవత్సరాన్ని ఏ విధంగా నడపాలి తదితర విషయాలపై చర్చించడం జరిగింది, గత సంవత్సరం మంచి మార్కులు సాధించడంతో ప్రధానోపాధ్యాయులను ప్రోత్సహించి, వచ్చే సంవత్సరం ఇంతకంటే మంచి ఫలితాలను తీసుకునిచ్చే విధంగా కష్టపడాలని నారాయణ విద్య సంస్థలు పేరును అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా తెలియజేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిఎం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ...ఇంత చక్కనైన సమావేశాన్ని ఏర్పాటు చేసిన మేనేజ్మెంట్ కు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జోన్ 2 ప్రిన్సిపల్స్ కి తెలియజేయడం జరిగింది..అదేవిధంగా కార్యక్రమంలో ఏజీఎం రవీంద్రబాబు, హేమాంబర్, మనోహర్ రెడ్డి, ఆర్.ఎన్.డి స్ శివాంజని, మహేశ్వరి, మీనా మరియు కో ఆర్డినేటర్స్ ప్రిన్సిపల్స్, సాఫ్ట్ స్కిల్స్, హెచ్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ లోని శానిటైజేషన్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలకు అనుమతి ఇస్తే అధికారులపై చర్యలు

అధికారులు ఎవరినైనా డబ్బులు అడిగితే క్యాంపు కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చు

అవినీతి చేయాలనుకునే అధికారులు వేరే చోటకి బదిలీ చేసుకోవచ్చు

ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి తలొగితే మీ భవిష్యత్తు నాశనం అవుతుంది...

కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి..






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 23 (అఖండ భూమి న్యూస్);** కామారెడ్డి ముస్సిపల్ కి చెందిన కమిషనర్, పట్టణ ప్రణాళిక, శానిటైజేషన్, ఇంజనీరింగ్, రెవెన్యూ, వాటర్ వర్క్స్ అన్ని విభాగాల అధికారులతో మీసా క్యాంపు కార్యాలయంలో గౌరవ కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి గారు సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ముస్సిపల్ లోని శానిటైజేషన్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి అని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలకు అనుమతి ఇస్తే అధికారులపై చర్యలు తప్పవని అదే సమయంలో నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికి తప్పక అనుమతి ఇవ్వాలని అన్నారు. అధికారులు ఎవరినైనా డబ్బులు అడిగితే క్యాంపు కార్యాలయంలో పిర్యాదు చేస్తారని నా దృష్టికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. అవినీతి చేయాలనుకునే అధికారులు వేరే చోటకి బదిలీ చేసుకోవచ్చు అని అన్నారు. ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి తలొగితే మీ భవిష్యత్తు నాశనం అవుతుంది అని అనవసరంగా భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు అని అన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన అంచనూరు ఉప సర్పంచ్...



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 23 (అఖండ భూమి న్యూస్);** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంచనూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఉప సర్పంచ్ కందుకూరి ప్రభాకర్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆశ బోయిన శ్రీనివాస ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పందిరి ప్రవీణ్ రెడ్డి, మెట్టు కాలాలి, ప్రశాంత్ గౌడ్ లు కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆశ పోయిన శ్రీనివాస్, తాటిపల్లి శ్రీకాంత్, అంచనూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తిరగంటి నరేష్, పందిరి రాంరెడ్డి, గోసానిపల్లి నరసింహులు పాల్గొన్నారు.

# భగభగ మండే ఎండను లెక్కచేయకుండా వడ్ల కేంద్రాల వద్ద రైతుల పడికాపులు



**బెల్లంపల్లి మే 23(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్ శనివారం వడ్ల కొనుగోలు కేంద్రాల విషయమై మాట్లాడుతూ...వడ్ల కేంద్రాల వద్ద రైతులు భగభగ మండే ఎండల్లో పడిగాపులు కాస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం తొందరగా కొనాలని తిరుగుతుంటే ఇంతవరకు బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఒక్క వడ్ల కేంద్రాన్ని కూడా తనిఖీ చేసిన సందర్భాలు లేవన్నారు. రైతులతో మాట్లాడిన దాఖలాలు కూడా ఎక్కడ లేవన్నారు. ఈరోజు ఎమ్మెల్యే వస్తున్నారంటే సుమారుగా నాలుగు ఐదు చోట్ల మామిడి తోటలు సాపు చేసి మేకలు తెంపి దావతులు ఇచ్చేందుకు సిద్ధము అవుతున్నారన్నారు. ఎమ్మెల్యే రైతుల కోసం వస్తున్నాడా దావతులకోసం వస్తున్నాడా అన్నది అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం చేసే రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్టు ఎక్కడ చరిత్రలో లేదన్నారు. అది ఎమ్మెల్యే ఒక్కసారి గ్రహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన ఉంటూ వాళ్లకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతుందన్నారు...

# మే 25న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం విజయవంతం చేయండి...!

గో టు విలేజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం అవగాహన సదస్సు



**నల్లగొండ జిల్లా ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు మండలం మే 23 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం కేంద్రంలోని ఆర్. అండ్. బి గెస్ట్ హౌస్ లో శనివారం నాడు ఎమ్మార్పీఎస్ - ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల మునుగోడు నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఎం. ఎస్. పి పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ సంయుక్తంగా మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటం పలితంగా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 9% రిజర్వేషన్లు అమలవుతున్న విషయం తెలిసిందే అన్నారు..పోరాడి సాధించుకున్న ఫలాలను మాదిగ నిరుద్యోగులు, విద్యార్థులు సంపూర్ణంగా సద్వినియోగం పరుచుకునే విధంగా మందకృష్ణ మాదిగ గోటువిలేజ్ అనే కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు..కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం మే 25న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు..ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ పాల్గొంటారని పేర్కొన్నారు..మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు..ఈ సమావేశానికి నియోజకవర్గ ఇంచార్జీ నల్లగంటి రమేష్ మాదిగ సభాధ్యక్షులుగా వహించగా, ఎమ్మార్పీఎస్ పార్టీ చండూరు మండల అధ్యక్షులు ఆకారపు యేసు మాదిగ స్వాగత ఉపన్యాసం చేశారు..ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పార్టీ చండూరు పట్టణ అధ్యక్షులు ఇరిగి చరణ్ మాదిగ, ఎం.ఎస్.పి చండూరు మండల అధ్యక్షులు కురుపాటి శంకర్ మాదిగ, నాంపల్లి మండల అధ్యక్షులు బుషిపాక నరేష్ మాదిగ, గట్టుప్పల్ నాయకులు బరిగెల లింగయ్య మాదిగ, మండల అధ్యక్షుడు సాయిలు మాదిగ, నాయకులు సురేష్ మాదిగ, అశోక్ మాదిగ, మహేష్, శంకర్ మాదిగ, గిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు...

# వలిగొండలో రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి...!!

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మిల్లుల్లో ధాన్యం నిల్వలు పెరిగాయి...!!

తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు...!!









**వలిగొండ, మే 23, ప్రతినిధి కళ్లెం బాలకృష్ణ మే 23 (అఖండ భూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలోని హనుమాన్, లక్ష్మీ నర్సింహ రైస్ మిల్లులను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను, నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైస్ మిల్లర్లతో సుదీర్ఘంగా చర్చించారు.

**కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఈ పరిస్థితి: ఎమ్మెల్యే**

తనిఖీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం ఇంకా మిల్లుల్లోనే నిల్వ ఉండిపోవడానికి కేంద్ర ప్రభుత్వ నిమ్మకు నీరెత్తిన వైఖరే కారణమని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో సీఎంఆర్ (జబర్శీఎ వీఅశ్రీశ్రీఅఅస్త్ర =అఎవ) రైసును కొనుగోలు చేసి ఉంటే, ప్రస్తుతం మిల్లులలో ఈ తరహా నిల్వలు ఉండేవి కావని స్పష్టం చేశారు. కేంద్రం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్లే నేడు ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన విమర్శించారు.

**రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం!**

ధాన్యంలో నల్లమచ్చ, తాలు వంటి ప్రకృతిసిద్ధమైన సమస్యల వల్ల రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే సమయంలో, మిల్లర్లు కూడా మానవతా దృక్పథంతో ఆలోచించాలని, తరుగు పేరుతో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని గట్టిగా హెచ్చరించారు.

**అధికారులకు, నాయకులకు కీలక ఆదేశాలు**

రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఎదురైనా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, పరస్పర సమన్వయంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు రైస్ మిల్లర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు....

# వార్షిక తనిఖీల్లో భాగంగా లింగంపేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

పాత నేరస్తులు, సస్పెక్ట్ ప్రతి కదలికపై గట్టి నిఘా ఉంచాలి..

ముందస్తు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి.

రాబోయే బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు సూచనలు.

ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి..

కేసుల నమోదు, రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలి.

జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర








**కామారెడ్డి ప్రతినిధి మే 23 (అఖండ భూమి న్యూస్):** వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, లింగంపేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా యెల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రాజిరెడ్డి, ఎస్ఐ దీపక్ కుమార్ పూలమొక్కలు అందించి ఎస్పీ కి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణ, క్రమశిక్షణ, ప్రజాసేవలపై పలు అంశాలను సమీక్షించారు. అధికారులకు సూచించిన విషయాలు సిబ్బందికి పూర్తిగా అవగాహన ఉందా లేదా అన్నది స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్స్, టెక్నికల్ రూం, స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు విధానం, సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్ భౌగోళిక మ్యాప్, క్రైమ్ హాట్‌స్పాట్స్ తదితర అంశాలను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ఎస్ఐ దీపక్ కుమార్‌ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు విధానం, ఆన్లైన్ సిసి టిఎన్ఎస్ వ్యవస్థ పనితీరు, ఫిర్యాదుదారులను స్వీకరించే విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్టర్లను చెక్ చేయడం జరిగింది ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శక సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకొని చట్టప్రకారం తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందించే విధంగా పనిచేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించాలని సూచించారు. ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామాన్ని నిరంతరం సందర్శిస్తూ గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.

మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై ప్రమాద హాట్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ ద్వారా శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు ముందస్తు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, కేసుల డిటెక్షన్ వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు అక్రమ గోవుల రవాణాను అడ్డుకోవాలని అధికారులకు ఆదేశించారు. లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ (గుడ్ వర్క్) కనబరిచిన హోం గార్డ్ లక్ష్మణ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు. అనంతరం స్టేషన్ అధికారుల పనితీరును అభినందిస్తూ, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఎల్లారెడ్డి డిఎస్పి.యస్.శ్రీనివాస్ రావు, యెల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి,లింగంపేట ఎస్‌హెచ్ఓ దీపక్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాట్రన్ మెంబర్‌గా డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా సన్మానం

వైస్ పాట్రన్ సభ్యత్వం పొందిన ఎం. సదాశివ రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 23 (అఖండ భూమి న్యూస్):** రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలి : జిల్లా కలెక్టర్ కామారెడ్డి జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రతిష్టాత్మక స్వచ్ఛంద సేవా సంస్థ "ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ"లో స్థానిక ఆర్.కె. విద్యాసంస్థల సీఈఓ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి పాట్రన్ మెంబర్‌గా (రూ.25,000 సభ్యత్వం) చేరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ డాక్టర్ జైపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి సభ్యత్వ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందించారు. అదేవిధంగా ఎం. సదాశివ రెడ్డి రెడ్ క్రాస్ సొసైటీలో వైస్ పాట్రన్ సభ్యత్వం (రూ.12,000) స్వీకరించగా, కలెక్టర్ వారికి మెమెంటోను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ సేవలో విశేష పాత్ర పోషిస్తున్న డాక్టర్ జైపాల్ రెడ్డి వంటి వ్యక్తులు రెడ్ క్రాస్ వంటి అంతర్జాతీయ గుర్తింపు కలిగిన సేవా సంస్థలో సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలోని యువత తమ విలువైన సమయాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించి రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుని సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యువత, విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మరింత విస్తృత స్థాయిలో ప్రజలకు సేవలందించే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలోని ప్రముఖులు, యువత, విద్యార్థులు కూడా రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీఎల్ బి గిరి, రెడ్ క్రాస్ నోడల్ అధికారి శశికుమార్, డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి, మర్రి సదాశివ రెడ్డి, దత్తాద్రి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 26న సౌత్ సెంట్రల్ రైల్వే మాజ్దూర్ యూనియన్ 56వ వార్షిక మహాసభలు






**బెల్లంపల్లి మే 23(అఖండ భూమి న్యూస్):**సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ 56వ వార్షిక మహాసభలు ఈ నెల 26న నిర్వహించనున్నారు.ఈ వార్షికోసత్వానికి సికింద్రాబాద్ కు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ శివ గోపాల్ మిశ్రా కు స్వాగతం పలుకుతూ మజ్దూర్ యూనియన్ న్యాయమైన కోరికలను వెంటనే అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ శంకర్రావు అలాగే సికింద్రాబాద్ డివిజన్ సెక్రెటరీ పి. రవీందర్,బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ ఎస్. నాగరాజు,సెక్రెటరీ జి.సాంబశివుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వారి కోర్కెలు

1.ఉద్యోగులకు కనీస వేతనం రూ॥ 69,000/-అలాగే ఇతర కోర్కెలను 8వ వేతనం సంఘం ఆమోదించాలి.

2.ట్రాక్ మెయింటెనర్ల కేటగిరీలో గ్రేడ్ - ఐవి నుండి గ్రేడ్ - 1 వరకు రూ.83,200/-,రూ॥ 1,12,000/- రూ.1,35,700/అలాగే రూ.1,82,500/-రూ.లను కనీస వేతనాలుగా మంజూరు చేయాలి.

3.డైరెక్టు రిక్రూట్మెంట్లో 10 శాతం తగ్గించి ఎల్ డి సీ ఈ కై అందరికీ అవకాశం కల్పించాలి.

4.ఇంటి అద్దె అలవెన్సును 'ఎక్స్' క్లాస్ సిటీకి 40% 'వై' క్లాస్ సిటీకి 35% మరియు 'జెడ్' క్లాస్ సిటీకి 30% వర్తింప చేయాలి.

5.పెరిగిన పని భారానికి తగ్గట్టుగా క్రొత్త పోస్టులను మంజూరు చేయాలి.

6.ప్రతి ఏటా 2% పోస్టులను రద్దు చేసే విధానాన్ని ఆపు చేయాలి.

7.ఎడ్యుకేషనల్ అలవెన్సును పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు ఇవ్వాలి.

8.రెండు షిఫ్టును ప్రవేశపెట్టి ట్రాక్ మెయింటెనర్లకు పని భారం తగ్గించాలి మరియు పెట్రోలింగ్ డ్యూటీకై ఇద్దరు ట్రాక్ మెయింటెనర్లను పంపాలి. మహిళా ఉద్యోగినులకు వేరే కేటగిరీలలోకి మారే అవకాశం ఇవ్వాలి.

9.అందరు నాన్ గెజిటెడ్ సిబ్బందికి ఆదాయపు పన్ను నుండి మినహాయింపునివ్వాలి.

10.ఖాళీల భర్తీకై లాటరల్ ఇండక్షన్ ను 30%కు పెంచాలి.

11.ప్రస్తుతం ఉన్న 3 ఎం.ఏ.సి.పిలకు బదులు 5 ఎం.ఏ.సి.పి లను మంజూరు చేయాలి.

12.భద్రతా కేటగిరీలు, ట్రాఫిక్ మరియు లో కో రన్నింగ్ కేటగిరీలు మరియు టెక్నికల్ పే స్కేళ్ళను ఇవ్వాలి. కేటగిరీలలో పనిచేస్తున్న సిబ్బందికి హయ్యర్ పేసే

13.ట్రాక్ మెయింటెనర్ కేటగిరీ మాదిరిగా పాయింట్స్ మెన్ కేటగిరీకి కూడా 4 గ్రేడ్ పేల వేతన స్ట్రక్చర్ను అమలు చేయాలి.

14.మెడికల్ డిపార్ట్మెంట్లోని అన్ని కేటగిరీలకు నోడల్ మినిస్ట్రీ అనగా భారత ప్రభుత్వం యొక్క ఆరోగ్య మంత్రిత్వ శాఖలోని కేటగిరీల మాదిరిగా వేతన స్కేళ్లను ఆ అమలు చేయాలి.

15.అందరు మహిళా ఉద్యోగినులకు ఇతర కేటగిరీలలోకి మారేందుకు అవకాశం కల్పించాలని,సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ 56వ వార్షిక మహాసభలకు పెద్ద సంఖ్యలో రైల్వే కార్మికులు పాల్గొని మన డిమాండ్స్ అన్ని వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు...

# లోన్ రికవరీ పేరుతో వేధింపులకు అడ్డుకట్ట వేస్తూ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన ఆర్బీఐ




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత అక్టోబర్ 1, 2026 నుంచి కొత్త రూల్స్ అమలు. రికవరీ ఏజెంట్ల తప్పిదాల వల్ల కస్టమర్ నష్టపోతే బ్యాంకే పరిహారం చెల్లించాలి. ఇకపై ఎవరినైనా రికవరీ ఏజెంట్లుగా నియమించడానికి వీల్లేదు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లేదా గుర్తింపు పొందిన సంస్థల సర్టిఫికేట్ ఉన్న వారినే నియమించాలి. రికవరీ ఏజెంట్ల పూర్తి వివరాలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే కస్టమర్లను సంప్రదించాలి. రికవరీ ఏజెంట్లు సభ్యతగా, మర్యాదగా మాట్లాడాలని ఆర్బీఐ ఆదేశం. అసభ్య పదజాలం, బెదిరింపులు, పదే పదే కాల్స్ చేసి వేధించడం పూర్తిగా నిషేధం. కస్టమర్ల బంధువులు, సహోద్యోగులను ఇబ్బంది పెట్టకూడదు. వ్యక్తిగత వివరాలు, ఆడియో/వీడియో రికార్డింగులను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం నిషేధం. కస్టమర్ మొబైల్‌లోని కాంటాక్ట్స్, ఫోటోలు వంటి డేటాను యాక్సెస్ చేయడం లేదా స్టోర్ చేయడం నిషేధం. లోన్ రికవరీ కోసం మొబైల్ ఫోన్ ఫీచర్లను బ్లాక్ చేసే టెక్నాలజీ వినియోగించకూడదు. మొబైల్ కొనుగోలు లోన్ అయితే గడువు ముగిసి 90 రోజులు దాటిన తర్వాత మాత్రమే ముందస్తు నోటీసుతో ఫోన్ లాక్ చేయాలి. ఫోన్ లాక్ చేసినా ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, ౹౹౹౹, ప్రభుత్వ భద్రతా అలర్ట్స్ నిలిపివేయకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ సర్వీసులు నిలిపితే ప్రతి గంటకు రూ.250 చొప్పున కస్టమర్‌కు పరిహారం. రికవరీ కోసం చేసే ప్రతి కాల్ సమయం, నంబర్, సంభాషణను బ్యాంకులు రికార్డ్ చేయాలి. కాల్ రికార్డులను కనీసం 6 నెలలు భద్రపరచాలి.లి కోర్టు కేసులు ఉంటే కేసు పూర్తయ్యే వరకు డేటా స్టోర్ చేయాలి. కొత్త రూల్స్‌తో రుణగ్రహీతల గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని ఆర్బీఐ వెల్లడి చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో యాదాద్రి ప్రగతి ప్రస్థానం: రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, వేద పాఠశాలకు స్వయంగా భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి...!!












**యాదాద్రి భువనగిరి, ప్రతినిధి కళ్లెం బాలకృష్ణ మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వైభవాన్ని, భక్తుల సౌకర్యాలను మరింత పెంపొందించే దిశగా భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. శనివారం యాదాద్రి క్షేత్రానికి విచ్చేసిన లితెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారులి నూతనంగా నిర్మించనున్న లివేద పాఠశాల భవన నిర్మాణ సముదాయానికిలి వైభవంగా భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా, రూ.100 కోట్ల భారీ వ్యయంతో ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి లిశ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు లిలిశ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు లిలిశ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డిలి మరియు ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా సాగిన భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో సీఎం గారు పాల్గొని పనులను ప్రారంభించారు.

**స్వామివారి దర్శనం - ప్రత్యేక పూజల్లో సీఎం రేవంత్ రెడ్డి**

అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారితో కూడిన బృందం యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ముఖ్యమంత్రి గారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారికి సీఎం గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు.

**ఆధ్యాత్మిక ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డి గారు మరియు ఇతర నేతలు మాట్లాడుతూ.. యాదాద్రి అభివృద్ధిని తమ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని స్పష్టం చేశారు. క్షేత్రాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రూ.100 కోట్లతో చేపట్టే ఈ నూతన పనులు మరియు వేద పాఠశాల నిర్మాణం రాష్ట్ర ఆధ్యాత్మిక ప్రగతికి, సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ఈఓ, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు....

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభ్యత్వం స్వీకరించిన మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ రాంటెంకి శ్రీనివాస్



**బెల్లంపల్లి మే23(అఖండ భూమి న్యూస్):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు,రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న అలాగే పార్టీ రాష్ట్ర నాయకులు కొమ్ముల ప్రవీణ్ రాజ్ చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ రాంటెంకి శ్రీనివాస్ శనివారం పార్టీ సభ్యత్వం అందించడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ అని పేర్కొన్నారు.రాష్ట్రంలో సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడం,యువతకు న్యాయం చేయడం,సామాజిక మార్పు తీసుకురావడం పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ..పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని,గ్రామస్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అయన పిలుపునిచ్చారు.ప్రజల విశ్వాసంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరింత బలపడుతుందని అయన అన్నారు.రాంటెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ..తీన్మార్ మల్లన్న నాయకత్వానికి ఆకర్షితుడై పార్టీ సభ్యత్వం తీసుకున్నానని,ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీతో కలిసి నిరంతరం పనిచేస్తానని ఆయన తెలిపారు...

# ఎస్బీఐ ఉద్యోగుల సమ్మె వాయిదా... బ్యాంకింగ్ సేవలు యథాతథం..!




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; మే 23 (అఖండ భూమి న్యూస్):** మే 25, 26 తేదీల్లో జరగాల్సిన ఎస్బీఐ సమ్మె వాయిదా వేసింది. యాజమాన్యంతో చర్చలు సఫలం కావడంతో ఉద్యోగ సంఘాల నిర్ణయం. అన్ని బ్రాంచీలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపిన ఎస్బీఐ. సిబ్బంది కొరత, ఔట్‌సోర్సింగ్ వంటి సమస్యలపై సమ్మెకు పిలుపు ఇచ్చింది. సమ్మె వాయిదాతో ఖాతాదారులకు తప్పిన ఇబ్బందులు.

# ప్రత్తిపాడు మండలంలో ఏవో జోకా అమృత ఎరువుల దుకాణాల తనిఖీలు

గడ్డి మందుపై తాత్కాలిక నిషేధం

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక





**ప్రత్తిపాడు, మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను శనివారం ఏవో జోకా అమృత తనిఖీ చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జి.ఓ నెం.421 ప్రకారం ఈ తనిఖీలు నిర్వహించబడినట్లు మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత తెలిపారు.తనిఖీల సమయంలో ప్రత్యేకంగా గడ్డి మందులు (పారాక్వాట్ డైక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్) మరియు దాని అనుబంధ ఫార్ములేషన్స్‌పై పరిశీలన చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చే వరకు ఈ గడ్డి మందును తాత్కాలికంగా నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.దాదాపు 2615 లీటర్ల గడ్డి మందుపై 60 రోజుల పాటు తాత్కాలిక నిషేధం విధించబడింది.తదుపరి ప్రభుత్వ సూచనలు వచ్చే వరకు ఏ డీలర్ కూడా ఈ మందును విక్రయించకూడదని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అలాగే అన్ని ఎరువుల దుకాణాలకు స్టాప్ సేల్ ఆర్డర్ జారీ చేసారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు అప్రమత్తంగా ఉండాలి

గుండాల తండాలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన జొన్నగిరి ఎస్సై మల్లికార్జున



**జొన్నగిరి, మే 23 (అఖండ భూమి న్యూస్):** మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్సై మల్లికార్జున సూచించారు. జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండాల తండాలో ఆయన ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై నేరాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి వేధింపులు, అనుమానాస్పద సంఘటనలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండేలా పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాలు, సహాయ సేవలు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. సమాజంలో మహిళల గౌరవం, చిన్నారుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నవరంలో నేడు వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జయప్రదం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపు



**అన్నవరం మే 23 (అఖండ భూమి న్యూస్):** సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై బూత్ స్థాయి ఏజెంట్లకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శంఖవరం మండలం అన్నవరం దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కేకే ఫంక్షన్ హాల్లో ఈ సమావేశం జరుగనుంది.ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని గిరిబాబు పిలుపునిచ్చారు.బూత్ లెవెల్ ఏజెంట్లు సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా,జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణ రాజు,ఎస్ఐఆర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు బి వి ఆర్ చౌదరి,ఒమ్మి రఘురామ్,వాసిరెడ్డి జమీల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.బూత్ లెవెల్ ఏజెంట్లు,గ్రామ అధ్యక్షులు,గ్రామ ముఖ్య నాయకులు,ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు,ముఖ్య కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై ఈ సమావేశంలో ఇచ్చే సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.

## పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పదు

బక్రీద్ సందర్భంగా జి.మాడుగుల పోలీసుల ప్రత్యేక నిఘా

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సీఐ లక్ష్మణరావు



**జి.మాడుగుల, మే 23 (అఖండ భూమి న్యూస్):** బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణా, జంతువులపై క్రూరత్వం మరియు చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు జి.మాడుగుల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు జి.మాడుగుల సీఐ లక్ష్మణరావు తెలిపారు. గౌరవ సుప్రీం కోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పశువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ పశువుల రవాణా, జంతువులపై క్రూరత్వం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించడంలో పత్రికా మిత్రులు కూడా పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ లక్ష్మణరావు కోరారు.

## రవాణా వ్యవస్థతోనే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి : ప్రత్తిపాటి

కట్టుబడివారిపాలెం-యడవల్లి మధ్య రూ.60లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.

కట్టుబడివారిపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, డ్రైన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే.





**చిలకలూరిపేట మే 23 (అఖండ భూమి న్యూస్):** గ్రామాల అభివృద్ధికి రోడ్లే కీలకమని, మంచి రవాణా వ్యవస్థ ఉన్నప్పుడే ప్రజల ఆర్థిక ప్రమాణాలు, జీవన విధానం మెరుగుపడుతాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం ఆయన చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం నుంచి యడవల్లికి రూ.60 లక్షలతో వేయనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం కట్టుబడి వారిపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైన్లు, సీసీ రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజలు ప్రాణాలు పోతున్నా, కనీసం రోడ్లపై ఉన్న గుంతలు కూడా పూడ్చలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పూర్తిచేసిందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రోడ్లతో పాటు..గ్రామాలు, మండల కేంద్రాలను అనుసంధానించే ప్రతి రోడ్డూ నిర్ణీత వ్యవధిలోగా పూర్తయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గుంజి శ్రీనివాసరావు, గంగా శ్రీనివాసరావు, చెన్నంశెట్టి ఏడుకొండలు, చెన్నంశెట్టి సాంబశివరావు, నాగంజి, వీరాంజనేయులు, నాగార్జున, కొత్తపల్లి వాసు, ముత్యాల రామారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌పై ఎల్ నినో ప్రభావంపై రైతులకు ఏవో జోకా అమృత సూచనలు

ఉత్తరకంచి,పెద్దిపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సు



**ప్రత్తిపాడు, మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి,పెద్దిపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో రైతులకు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తుగా సాగుకు సమాయత్తం కావాలని సూచించారు.తక్కువ కాలంలో పండే వరి రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని రైతులకు తెలియజేశారు.అలాగే వరి సాగుకు అనుకూలం కాని భూముల్లో మినుములు,పెసర్లు,నీటిఎద్దడిని తట్టుకునే రాగులు,మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.రైతు సేవా కేంద్రాల్లో ఎండాకాలానికి సంబంధించిన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.జీలుగ విత్తనాలు 10 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 10 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.ఈ విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు.జీలుగ విత్తనాలు కిలో రూ.80కి, జనుము విత్తనాలు కిలో రూ.77కి అందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉత్తరకంచి తాజా మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ,సుబ్బారారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కలిసిన లిపత్తికొండ నియోజకవర్గ బీజేపీ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం -- తుగ్గలి నవీన్ రెడ్డి





**తుగ్గలి, మే 23 (అఖండ భూమి న్యూస్):** పత్తికొండ నియోజకవర్గానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పత్తికొండ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, సంస్థాగత బలోపేతం, కార్యకర్తల పాత్ర, గ్రామ స్థాయి కమిటీల పనితీరు తదితర అంశాలపై బండి సంజయ్ ఆరా తీసినట్లు నవీన్ రెడ్డి తెలిపారు. పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీజేపీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని బండి సంజయ్ సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో పత్తికొండ నియోజకవర్గంలో బీజేపీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మన్న బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడ 'కుడా' ఛైర్మన్ పదవి పవన్ కళ్యాణ్ బీసీలకే ఇస్తారనుకున్నాం.. కానీ నిరాశే మిగిలింది.పెద్దింశెట్టి

కూటమి ప్రభుత్వంలో బీసీ, ఎస్సీలకు తీవ్ర అన్యాయం: తెలుగు జనతా పార్టీ అధినేత పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ధ్వజం.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి? పవన్ కళ్యాణ్ గారూ.. ఒక్కసారి ఆలోచించండి!

కిర్లంపూడి సొసైటీలో రూ. 104 కోట్ల కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరపాలి.

కొవ్వూరు వారాహి మాత ఆలయ వివాదంపై స్పష్టత ఇవ్వాలి: మీడియా సమావేశంలో పెద్దింశెట్టి ఆవేదన.




**తెలుగు జనతా కాకినాడ మే 23 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లాలో నామినేటెడ్ పదవులు, చైర్మన్ పోస్టులు మరియు స్థానిక సంస్థల పదవుల కేటాయింపుల్లో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, పక్షపాత వైఖరిని ఎండగట్టారు.

### ఎన్నికల హామీలు విస్మరించిన పవన్ కళ్యాణ్!

ఎన్నికల సమయంలో ఇంద్రపాలెం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను పెద్దింశెట్టి ఈ సందర్భంగా గుర్తు చేశారు."గత వైసిపి ప్రభుత్వంలో కేవలం ఒకే సామాజిక వర్గానికి (రెడ్లకు) మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, బీసీ, ఎస్సీలను పట్టించుకోవడం లేదని పవన్ కళ్యాణ్ నాడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పిస్తామని నమ్మబలికారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక దానికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్నారు," అని పెద్దింశెట్టి ఆరోపించారు.

### 'కుడా' చైర్మన్ పదవిపై ఆశలు అడియాసలు!

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పదవినైనా పవన్ కళ్యాణ్ బీసీ సామాజిక వర్గానికి ఇస్తారని అందరూ భావించారని, కానీ అక్కడ కూడా బీసీలకు నిరాశే మిగిలిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గంతో పాటు, కాకినాడ టౌన్, రూరల్ నియోజకవర్గాల్లో ఉన్న కీలకమైన నామినేటెడ్ పోస్టులు, చైర్మన్ పదవులు, లోకల్ బాడీ పోస్టులన్నింటినీ పవన్ కళ్యాణ్ తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారికే కట్టబెట్టారని విమర్శించారు..."ఆయా నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు మీకు కనిపించడం లేదా? ఎన్నికల్లో కేవలం మీ సామాజిక వర్గం ఓట్లతోనే మీరు పిఠాపురంలో గెలిచారా? ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు కూడా మీకు ఓట్లు వేశారనే విషయాన్ని కూటమి నాయకులు మరిచిపోకూడదు," అని పెద్దింశెట్టి హెచ్చరించారు.

కొవ్వూరు వారాహి మాత గుడి వివాదం: కాకినాడ రూరల్ నియోజకవర్గం కొవ్వూరులో జరిగిన ఒక ఉదంతాన్ని పెద్దింశెట్టి మీడియా వేదికగా లేవనెత్తారు. అక్కడ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన ఒక మహిళ సొంతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని, చిన్న వారాహి మాత ఆలయాన్ని నిర్మించుకుంటే.. స్థానిక రాజకీయ పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ గుడిని ప్రభుత్వానికి అప్పగించేలా చేశారని ఆరోపించారు. "బీసీ మహిళ కట్టుకున్న ఆలయాన్ని లాక్కోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటి? ఇదంతా పవన్ కళ్యాణ్‌కు తెలిసి జరుగుతుందా? లేక ఆయనకు తెలియకుండా స్థానిక నాయకులు చేస్తున్నారా?" అని ఆయన ప్రశ్నించారు.

### కిర్లంపూడి సొసైటీలో రూ. 104 కోట్ల భారీ కుంభకోణం!

ఇదే సమయంలో జిల్లాలో జరిగిన మరో భారీ కుంభకోణాన్ని పెద్దింశెట్టి వెలుగులోకి తెచ్చారు. కిర్లంపూడి సొసైటీలో సుమారు రూ. 104 కోట్ల మేర భారీ అవినీతి, కుంభకోణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి సిఐడి కార్యాలయంలో పిర్యాదు చెయ్యగా సిఐడి అధికారులు 07-08-2025 వతేదీన 13/2025 సెక్షన్ 420, 409, 406 రెడ్ విత్ 120బి సెక్షన్ లతో 10 మంది పై కేసు నమోదు చేశారు అని గుర్తుచేశారు. ముఖ్యంగా ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు, అవినీతికి గురైన సొమ్మును పూర్తిగా రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం, వారికి జరుగుతున్న అన్యాయాలపై తెలుగు జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

## మీసేవ నిర్వాహకుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి : పోరుమామిళ్ల రాము

ఏపీ మీ సేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా మీసేవ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక






**అనంతపురం (ఏబి నెట్వర్క్ )మే 23 (అఖండ భూమి న్యూస్):** అనంతపురం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో ఏపీ మీ సేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శనివారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా మీసేవ నిర్వాహకులు ఏకగ్రీవంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర మీసేవ కమిటీ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు. ఏపీ మీ సేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా నూతన కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్.జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బషీర్, ప్రధాన కార్యదర్శిగా జగదీష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా జయరాం రెడ్డి, వన్నన గౌడ్, ఎం.డి.నాగరాజు,కోశాధికారిగా ఎం. మంజునాథ్, మహిళా అధ్యక్షురాలిగా పూర్ణిమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ మీ సేవ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మీసేవ అసోసియేషన్ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ.... మీసేవ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల సంఖ్య తగ్గిపోవడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలో వేగంగా అందించడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రస్తుతం సరైన ఆదాయం లేక అనేక కేంద్రాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మీసేవ నిర్వాహకులకు అందుతున్న కమీషన్ చాలా తక్కువగా ఉండటంతో కార్యాలయ అద్దెలు, విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్ ఛార్జీలు, సిబ్బంది జీతాలు కూడా చెల్లించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా సేవలపై కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మరిన్ని సేవలను మీసేవ కేంద్రాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సులభంగా సేవలు అందే విధంగా మీసేవ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మీసేవ నిర్వాహకుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ కారణంగా మీసేవ నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మీసేవ కేంద్రాల నిర్వహకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యదర్శి బుచ్చిబాబు, కోశాధికారి రమణారావు, యాసిన్‌తో పాటు అనంతపురం జిల్లా మీసేవ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండవీడు ఘాట్ రోడ్, జాతీయ రహదారితో అనుసంధానంతో కోటకు పూర్వ వైభవం : ప్రత్తిపాటి

ఘాట్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు కేంద్ర మంత్రి గడ్కరీకి అందచేశాం.

కేంద్రం నుంచి అనుమతులు, నిధులు వచ్చిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభం.

శారీరక వ్యాయామంతో ప్రశాంతమైన, మెరుగైన ఆరోగ్యం.

సొలసలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ప్రారంభించిన ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట మే 23( అఖండ భూమి న్యూస్):** శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతతతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని, మందుల వాడకం.. వైద్యసేవలతో పనిలేకుండానే ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవించవచ్చని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం యడ్లపాడు మండలం సొలస గ్రామంలోని చెరువు కట్టపై రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ను స్థానిక నాయకులతో కలిసి ప్రత్తిపాటి లాంఛనంగా ప్రారంభించారు. రోటరీ క్లబ్ సభ్యులు, స్థానికులతో కలిసి కాసేపు జిమ్ లో వ్యాయామం చేసిన అనంరతం ఆయన మాట్లాడారు. కొండవీడు ఘాట్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానిస్తూ త్వరలోనే నూతన రోడ్డు మార్గం ఏర్పడనుందని ప్రత్తిపాటి చెప్పారు. కొత్త రహదారి నిర్మాణ వివరాలు, అంచనా వ్యయం సమాచారాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, తాను కేంద్ర మంత్రి గడ్కరీకి అందచేశామన్నారు. కేంద్రం నుంచి నిధులు, పరిపాలనా అనుమతి లభిస్తే, ముఖ్యమంత్రి ఎప్పటినుంచో నిర్మించాలనకుంటున్న చౌడవరం టన్నెల్ నిర్మాణం కూడా పూర్తవుతుందన్నారు. జాతీయ రహదారి నుంచి నేరుగా రోడ్డు అందుబాటులోకి వస్తే, కొండవీడు కోటకు పూర్వ వైభవం లభిస్తుందన్నారు. గతంలో యడ్లపాడు మండలంలో ఎక్కడా చూసినా రోడ్లు అధ్వాన్నంగా ఉండేవని, కూటమిప్రభుత్వం వచ్చాకే అన్నిరోడ్లను అద్దాల్లా తీర్చిదిద్దామన్నారు. రోటరీ క్లబ్ నిర్వాహకులతో పాటు.. గ్రామ నాయకులు వీరారెడ్డి తదితరుల కృషి వల్లే సొలస గ్రామస్తులకు మంచి వ్యాయామశాల అందుబాటులోకి వచ్చిందన్నారు. సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ను కులమతాలు, పార్టీలకు అతీతంగా అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 27, 28 తేదీల్లో వర్చువల్ గా



నిర్వహించే మహానాడుని అన్ని గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రోటరీ క్లబ్ గవర్నర్ డా. ఎస్.వి. రామ్ ప్రసాద్, రోటరీ సభ్యులు వాసిరెడ్డి బాలకోటి రెడ్డి, ఉప్పుటూరి ప్రసాద్, బోడె రామ సుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కళ్యాణ్, అడుసుమల్లి మోహన్ రావు, సాంబశివరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యగా మారాలి : ప్రత్తిపాటి

క్లీన్ స్వీప్ లో భాగంగా చీపురు పట్టి రోడ్డు శుభ్రం చేసిన ప్రత్తిపాటి.

తాటిముంజలమ్మే చిన్నారులతో మాట్లాడి, ముంజలు కొని రుచిచూసిన ఎమ్మెల్యే.

**చిలకలూరిపేట మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రజల భాగస్వామ్యం, వారి బాధ్యతాయుత పనితీరుతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన చిలకలూరిపేటలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టిన ప్రత్తిపాటి.. స్థానిక నాయకులతో కలిసి రోడ్డు శుభ్రం చేశారు. అనంతరం ఒక కూడలిలో తాటిముంజలు అమ్ముతున్న చిన్నారులతో మాట్లాడి, ఎక్కడి నుంచి వచ్చారు. తాటికాయలు ఎక్కడ తెచ్చారు.. అన్నీ అమ్మితే ఎంత లాభం వస్తుందని వారిని ప్రశ్నించగా, పిల్లలు ఉత్సాహంగా ప్రత్తిపాటికి సమాధానమిచ్చారు. అనంతరం వారి వద్ద ముంజలు కొనుగోలు చేసి రుచిచూసిన ప్రత్తిపాటి బాగున్నాయని వారిని మెచ్చుకున్నారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజలు తమ సొంతపనులుగా భావించాలి...**

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ క్లీన్ స్వీప్ అయినా.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. ప్రభుత్వం వీధులు, పట్టణాలు, గ్రామాల శుభ్రతను ఒక ప్రాజెక్టులా నిర్వహిస్తోందని, అలాంటప్పుడు ప్రజలు ఇష్టానుసారం వ్యవహరిస్తే ఉపయోగం ఏముంటుందని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే, దానిని ప్రజలు తమ సొంత పనిగా భావించాలన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యలో భాగం కావాలన్న ప్రత్తిపాటి.. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలే సుస్థిర అభివృద్ధికి అసలైన ప్రామాణికాలుగా నిలుస్తాయన్నారు. హరితాంధ్ర, స్వచ్ఛాంధ్ర అనేవి కేవలం నినాదాలు కావని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే గొప్ప కార్యక్రమాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వ్యర్థాల నిర్వహణ, రీ సైక్లింగ్, హరితాంధ్ర కార్యక్రమాలతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మస్తాన్ వలి, మౌలాలి, తుపాకుల అప్పారావు , మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.









## ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలి- ఏవో సుధా మాధురి

ఎల్‌నినో ప్రభావంపై అవగాహన..

గడ్డి మందుపై స్టాప్ సేల్ చర్యలు





**కిర్లంపూడి, మే 23 (అఖండ భూమి న్యూస్):** కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు,రాజుపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగు సమాయత్త కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో సుధా మాధురి రైతులకు పలు సూచనలు చేశారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.నీరు విడుదలైన వెంటనే దమ్ములు సిద్ధం చేసుకుని,ఆకు మడులు వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ సార్వా సీజన్‌లో వెదజల్లు విధానానికి బదులుగా ఎంటీయూ పద్ధతిలో సాగు చేయాలని,నారుమడులు వేసుకుని సాగు ప్రారంభించాలని సూచించారు.రైతులు ఎంటీయూ-1318, బీపీటీ-3085,స్వర్ణ,సంపద స్వర్ణ వంటి దీర్ఘకాలిక,మధ్యస్థ రకాల వంగడాలను సాగు చేయాలని తెలిపారు.రైతులకు అవసరమైన ఎరువులు యాప్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని,రైతు కార్డు ద్వారా సకాలంలో ఎరువులు పొందాలని కోరారు.అలాగే పంట కోత అనంతరం పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు.అలాగే మండలంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి, పారాక్వాట్ డైక్లోరైడ్ ఎస్ఎల్ మందు నిల్వ ఉంచిన దుకాణాలకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 475 లీటర్ల మందుపై స్టాప్ సేల్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆకుల సురేష్,వీఏఏ వర్మ,దేవి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న పాలిక చినబాబుకు ముదునూరి రూ.5 వేలు ఆర్థిక సాయం



**ప్రత్తిపాడు, మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో పాలిక చినబాబు ఇటీవల కాలు,చేతి నొప్పులతో బాధపడుతున్నారని తెలిసి వైఎస్సార్ సిపి నాయకుడు,నరసాపురం పార్లమెంటు పరిశీలకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు,కోన బాబ్జి,తూపాటి బాబ్జి,యాళ్ల ఏసుబాబు,జువ్వల ముసలయ్య,రాపా అప్పన్న,మారెళ్ల అప్పన్నబాబు, అంబటి అప్పోజి,బీజ అప్పలరాజు,గుబ్బల కుమార్, కుడుముల శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం

నష్టపరిహారంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం : ఆర్డీవో ఓబులేష్.





**తుగ్గలి, మే 23 (అఖండ భూమి న్యూస్):** జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం తరపున తగిన నష్టపరిహారం అందించడంతో పాటు ఫ్యాక్టరీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీవో ఓబులేష్ తెలిపారు. శనివారం తుగ్గలి మండలంలోని జొన్నగిరి, ఉప్పర్లపల్లె గ్రామాలకు చెందిన రైతులతో భూసేకరణ అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను ఆర్డీవో స్వయంగా తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, రైతుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. భూములు కోల్పోయే కుటుంబాలకు న్యాయమైన పరిహారం అందించడంతో పాటు మైన్స్ యాజమాన్యంతో చర్చించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవి, విఆర్వోలు కాశి రంగస్వామి, రాజేశ్వరి, మైన్స్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అన్నవరంలో నేడు వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జయప్రదం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపు



**అన్నవరం ,మే 23 (అఖండ భూమి న్యూస్):** సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై బూత్ స్థాయి ఏజెంట్లకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శంఖవరం మండలం అన్నవరం దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కేకే ఫంక్షన్ హాల్లో ఈ సమావేశం జరుగనుంది.ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని గిరిబాబు పిలుపునిచ్చారు.బూత్ లెవెల్ ఏజెంట్లు సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా,జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణ రాజు,ఎస్ఐఆర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు బి వి ఆర్ చౌదరి,ఒమ్మి రఘురామ్,వాసిరెడ్డి జమీల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.బూత్ లెవెల్ ఏజెంట్లు,గ్రామ అధ్యక్షులు,గ్రామ ముఖ్య నాయకులు,ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు,ముఖ్య కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై ఈ సమావేశంలో ఇచ్చే సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.

## చెడ్డి గ్యాంగ్ కదలికలతో అప్రమత్తమైన వైపాలెం పోలీసులు



**యర్రగొండపాలెం మే 23 (అఖండ భూమి న్యూస్):** ప్రకాశం జిల్లాలో చెడ్డి గ్యాంగ్ కదలికలు ఉన్నాయనే సమాచారంతో మార్కాపురం జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం సిఐ కె అజయ్ కుమార్,ఎస్సై ఎం దేవ కుమార్ ఆధ్వర్యంలో పట్టణానికి సమీపంలోని గ్రామ శివార్ల ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పట్టణ శివార్లలో పుల్లలచెరువు రోడ్డులోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో గుడారాలు వేసుకుని నివాసం ఉంటున్న వారితో మాట్లాడారు.వారి వివరాలను సేకరించి,అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.పోలీసులు ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు.ఈ సందర్భంగా సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ఇళ్ల తలుపులు,కిటికీలు బిగించి పెట్టుకోవాలన్నారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.అపరిచితులను ఇంట్లోకి అనుమతించకూడదని చెప్పారు.నగదు,బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండి,పొరుగువారితో సమన్వయం కలిగి ఉండాలన్నారు.ఒంటరిగా ఉన్న వృద్ధులు,మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎలాంటి అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని,ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు.

## వేమవరం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మరమ్మత్తు పనులు






**మాచవరం మే 23 (అఖండ భూమి న్యూస్):** మాచవరం మండలం వేమవరం గ్రామంలో మరియు పంచాయతీ అధికారులు 45 రోజుల క్రితం డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేశారు అయితే ఈ పైపులు వేసే సమయంలో సిమెంట్ రోడ్డుకు గాళ్లు వేసి సిమెంటు దోన్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిపై సిమెంట్ చేయకుండా వదిలివేయడంతో బాటసారిలకు ద్విచక్ర వాహనదారులకు చాలా ఇబ్బంది కరంగా ఉందని అధికారులకు తెలియజేసిన పట్టించుకోవట్లేదు అన్నారు దీంతో స్పందించిన జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాటికి మరమ్మత్తు పనులు చేయించి సిమెంట్తో ఏర్పాటు చేశారు అధికారులు స్పందించకపోయినా గ్రామ అభివృద్ధికి తాము ముందుంటామని జనసేన పార్టీ నాయకులు అన్నారు

## పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైనమీసేవ ఆపరేటర్ల పిల్లలను సత్కరించిన మీసేవ అసోసియేషన్





**అనంతపురం ( ఎబి నెట్వర్క్ ) మే 23 (అఖండ భూమి న్యూస్):** ఏపీ మీసేవ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు అనంతపురంలో జిల్లా స్థాయి నూతన కార్యవర్గ ఎన్నిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యలో ప్రతిభ కనబరిచిన మీసేవ ఆపరేటర్ల పిల్లలను సత్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన మీసేవ ఆపరేటర్ల పిల్లలకు అప్రిషియేషన్ సర్టిఫికెట్లు అందజేసి, చిరుకానుకలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోరుమామిళ్ల రాము, ఇతర నాయకులు హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉత్తమ మార్గదర్శకత్వం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, మరింత ఉన్నత విజయాలకు దోహదపడతాయని వారు అన్నారు.

## పింఛన్లు మంజూరు చేయాలని గిరిజనుల వేడుకోలు

దరఖాస్తులు చేసినా స్పందన లేదని మెట్టపాడు గ్రామస్తుల ఆవేదన.



**జి.మాడుగుల మే 23 (అఖండ భూమి న్యూస్):** జి.మాడుగుల మండలంలోని పెదలోచాలి పంచాయతీ మెట్టపాడు గ్రామానికి చెందిన గిరిజనులు తమకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్లు మంజూరు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వంతల సాంబి, వంతల కొండబాబు, వంతల రామారావు, పాంగి కుమారి మాట్లాడుతూ పలుమార్లు దరఖాస్తులు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. వృద్ధాప్య వయసులో వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి నెలకొనడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికే ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పింఛను వివరాల కోసం సచివాలయాలకు వెళ్తే నమోదు ప్రక్రియకు సమయం పడుతుందని చెబుతున్నారని, దీంతో తమ సమస్య ఎప్పటికీ పరిష్కారం కావట్లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన తమకు వెంటనే పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు వేసుకున్న అడ్డపుంత గ్రామస్తులు



**కాట్రేనికోన మే 23 (అఖండ భూమి న్యూస్):** సాధారణంగా అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు రోడ్లు నిర్మిస్తుంటారు. ఇందుకు భిన్నంగా దొంతికుర్రు పంచాయతీ పరిధిలోని అడ్డపుంత కు చెందిన గ్రామస్తులు అంతా ఏకమైగ్రావెల్ రోడ్డును నిర్మించుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలుఈ విధంగా ఉన్నాయి.ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇటీవల ఈ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. గెద్దనపల్లి,పోరా పేట విద్యార్థులు పలువురు ఈ మార్గం ద్వారా దొంతుకుర్రు హై స్కూల్ కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో పండిన కొబ్బరి, వరి పంటలను ఈ మార్గం ద్వారానే రైతులు రోడ్డుకు చేరవేస్తుంటారు. ఈ రహదారి పక్కన కాశి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి స్థలాన్ని కొనుగోలు చేశాడు. గతంలో కొంతమంది రైతులు స్థలాన్ని కొనుగోలు చేసి రోడ్డు వేయాలని పంచాయతీకి సంబంధిత డాక్యుమెంట్స్ సమర్పించారు. అయితే సరిహద్దుదారుడు రోడ్డును అడ్డుకునేందుకు అడ్డంగా కర్రలు పాతాడు. అంతేకాక తహసిల్దార్ కు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసిల్దార్ రవికిరణ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇరు వర్గాలకు సర్వే నిమిత్తం నోటీసులు ఇవ్వాలనిసర్వేయర్ను ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులు సర్వే నిర్వహించేందుకు ఆ ప్రాంతానికి వెళ్లారు. ఉమ్మడి రహదారి కావడంతో ఆ గ్రామస్తులంతా పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఫిర్యాదుదారుడు సర్వేకుసహకరించలేదని అధికారులు తెలిపారు. దీంతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న గ్రామస్తులందరూ ఏకమై తామే స్వయంగాఅధికారుల సమక్షంలోగ్రావెల్ రోడ్డు నిర్మించారు.

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ను కలిసిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



**మాచవరం మే 23 (అఖండ భూమి న్యూస్):** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ను గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు దాచేపల్లి కొత్త మున్సిపల్ బిల్డింగ్ కి రూ. 2 కోట్లు, గురజాల కొత్త మున్సిపల్ బిల్డింగ్ కి రూ. 2 కోట్లు రూపాయలు శాంక్షన్ చేశారని ఎమ్మెల్యే అన్నారు. దాంట్లో రెండు మున్సిపాలిటీల కొత్త బిల్డింగులకు కోటి, కోటి రూపాయలు చొప్పున ఇప్పుడు రిలీజ్ చేశారన్నారు.. రెండు బిల్డింగులు శాంక్షన్ అయ్యాయి. గురజాల టౌన్ లోని సుంకర కుంట చెరువు ఆధునీకరణకు రూ.2.5 కోట్లు ప్రపోజల్ పెట్టాము, దీనిని కూడా మంత్రి శాంక్షన్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.. అలాగే పిడుగురాళ్ల పట్టణంలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులను రూ.11 కోట్లతో వెంటనే ప్రారంభించమని అధికారులకు కూడా మంత్రిగారు ఆదేశాలు ఇవ్వటం జరిగింది. మూడు మున్సిపాలిటీల్లో కూడా వాటర్ వర్క్స్ గానీ, మెగావాళ్లు తీసుకున్న మూడు మున్సిపాలిటీల్లో పనులు గానీ వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మూడు మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు అవసరమైన నిధులు శాంక్షన్ చేయాలని మంత్రిగారిని యరపతినేని శ్రీనివాసరావు కోరారు

## ఎన్ సి సి క్యాడెట్లకు రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం






**కాకినాడ, మే 23 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జేఎన్టీయూకే అల్యూమినియం స్టేడియం నందు ఎన్ సి సి క్యాడెట్లకు మరియు విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్,రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాలపై డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులకు అందిస్తున్న నగదు రహిత (ఉచిత) వైద్య చికిత్స విధానం గురించి వివరించారు.ప్రమాదం జరిగిన తేదీ నుండి ఏడు రోజుల్లోగా రూ.1,50,000 వరకు ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అని సూచించారు.అలాగే ట్రిపుల్ రైడింగ్,బైక్ స్టంట్స్,మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.జీబ్రా లైన్లు లేని చోట రోడ్డు దాటే విధానం,ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత,ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదని వివరించారు.మహిళల భద్రత,ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.సైబర్ నేరాలపై భాగంగా ఆన్‌లైన్ మోసాలు,ఫేక్ లోన్ యాప్స్ మోసాలు,ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు,డిజిటల్ అరెస్ట్ మోసాలు వంటి వాటిపై విద్యార్థులకు వివరించారు.అత్యవసర నంబర్లు 112, 1930, 1972 వినియోగం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ఎన్ సి సి గ్రూప్ కెప్టెన్ పి ప్రవీణ్ బాబు,ఎస్సై సత్యనారాయణ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపరేషన్ దుర్గం చెరువు



సైకో ఇచ్చిన వన్ మినిట్ టాస్క్‌ను సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర.ఇంతలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద ఓ పిల్లాడు వేలాడుతున్నట్టు రుద్రకు సమాచారం వచ్చింది. దీంతో టీమ్‌తో అక్కడికి ప్రయాణమయ్యాడు. దారిలో వెళ్తున్న రుద్రకు 'ఆ పిల్లాడిని మామూలుగా వదిలేస్తే కిక్ ఏముంది చెప్పు??' అన్న సైకో మాటలే మెదడులో గిర్రున తిరుగుతున్నాయ్. అంటే, నెక్ట్స్ విడిచిపెట్టే పిల్లాడిని అంత ఈజీగా సైకో వదిలిపెట్టడని అర్థమైపోయింది. పది నిమిషాల్లో దుర్గం చెరువు వచ్చింది. కేబుల్ బ్రిడ్జి మీదినుంచి ఓ పెద్ద సంచిలో ఓ పిల్లాడిని ఎవరో వేలాడదీశారు. అయితే, సంచిలో ఎలాంటి కదలికలూ కనిపించలేదు. బ్రిడ్జి మీదినుంచి వేలాడుతున్న పిల్లాడిని ఎందుకు పైకి లాగలేదని రుద్ర అక్కడ ఉన్న సిబ్బందిని గద్దించాడు. దీంతో సంచికి కట్టిన తాడు మొదట్లో ఓ లెటర్ అతికించి ఉందన్న విషయాన్ని రుద్రకు చెప్పారు అక్కడి కానిస్టేబుల్స్. బ్రిడ్జ్ మీదికి ఏ వాహనాలూ రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించి ఆ లెటర్ చదవడం ప్రారంభించాడు.

'హలో రుద్రా.. పిల్లల్లో ఒకడిని ఈ సంచిలో పెట్టి వేలాడదీసింది నేనే. సీసీటీవీ ఫుటేజీ వగైరా అంటూ టైమ్ వేస్ట్ చేసుకోకుండా నేను ఇచ్చే రెండు పజిల్స్‌ను నిమిషంలో సాల్వ్ చెయ్యి. ఒకవేళ జవాబు తప్పుగా చెప్పినా లేక, ఇన్‌టైమ్‌లో ఆన్సర్ చేయలేకపోయినా.. పిల్లాడికి కట్టిన తాడు దానంతట అదే ఊడిపోతుంది. పిల్లాడు అంతెత్తు నుంచి నీటిలో పడిపోతాడు. పాపం.. మత్తులో ఉన్నాడు కదా.. ఈత కొట్టే అవకాశం కూడా ఉండదు. మరో విషయం.. నీ పోలీసు బుద్ధితో ఇప్పుడే పిల్లాడిని విడిపించుకోవాలని చూస్తావేమో! ఆ ప్రయత్నం చేస్తే.. అబ్బాయే కాదు.. మొత్తం బ్రిడ్జి పేలిపోతుంది. మరి ఈ 'ఆపరేషన్ దుర్గం చెరువు'ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేస్తావా?' అంటూ లెటర్ ముగించాడు సైకో. ఇంతలో ఆకాశం నుంచి ఓ డ్రోన్ ద్వారా ఓ లెటర్ రుద్ర ముందు పడింది. దాన్ని తెరిచి చదవడం ప్రారంభించాడు రుద్ర. 'మిస్టర్ రుద్రా.. ఇప్పుడు టైమ్ రాత్రి 10.20 గంటలు. 10.30 గంటల నుంచి 10.31 గంటల వరకూ అంటే ఒక్క నిమిషంలో నేను అడిగే పజిల్‌కు నువ్వు ఆన్సర్ చేయాలి. క్వశ్చన్లు సరిగ్గా 10.30 గంటలకు ఈ డ్రోన్ నుంచి ఓ లెటర్ రూపంలో కింద పడతాయి. నువ్వు ఆన్సర్స్‌ను డ్రోన్‌లోని వాయిస్ రికార్డర్‌కు వినిపించేంత గట్టిగా ఒక్క నిమిషంలో చెప్పాలి. సమాధానం కరెక్ట్ అయితే.. పిల్లాడు, బ్రిడ్జి రెండూ సేఫ్.. లేదంటే.. పిల్లాడు, బ్రిడ్జ్ రెండూ ఫినిష్! వెయిట్ ఫర్ మై క్వశ్చన్స్' అని రాసి ఉంది. దీంతో రుద్ర హార్ట్‌బీట్ మరింతగా పెరిగింది. సమయం.. రాత్రి 10.30 గంటలు. డ్రోన్ నుంచి ఓ లెటర్ కిందపడింది. అందులో ఇలా ఉంది.. 'రుద్రా.. మొదటి ప్రశ్న.. సునందకు నలుగురు కూతుళ్లు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ ఉన్నాడు. ఇప్పుడు సునందకు ఎంతమంది పిల్లలు ఉన్నారో.. సంచిలో ఉన్న ఈ అబ్బాయి ఇంట్లో కూడా అంతమంది ఉంటారు. ఈ అబ్బాయి ఎవరి కొడుకు? రెండో ప్రశ్న.. కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప. అదేంటో గట్టిగా అరిచి చెప్పు' అని ఉంది. ప్రశ్నలు చదవడానికే అర నిమిషం పూర్తయింది. దీంతో అప్రమత్తమైన రుద్ర.. ఐదుగురి పిల్లల పేరెంట్స్‌ను వెంటనే పిలిచి.. ఎవరింట్లో ఎంతమంది ఉంటారో అడిగాడు. మొదటి వ్యక్తి 8, రెండో వ్యక్తి 9, మూడోవ్యక్తి 5, నాలుగో వ్యక్తి 6, ఐదో వ్యక్తి ఏడుగురు అని సమాధానం చెప్పారు. దీంతో సంచిలో ఉన్న పిల్లాడు ఎవరి కొడుకో రుద్ర గట్టిగా అరిచి చెప్పాడు. ఇంకో పది సెకండ్ల టైమ్ మాత్రమే మిగిలి ఉంది. కుడి చెయ్యి–ఎడమ చెయ్యి పజిల్‌కు ఆన్సర్ ఏంటో రుద్రకు స్ఫురించట్లేదు. ఏమైతుందోనని అంతా ఒకటే టెన్షన్. ఇంతలో ఏదైతే అదైందని తాను అప్పటికప్పుడు అనుకొన్న ఆన్సర్‌ను గట్టిగా అరిచి చెప్పాడు రుద్ర. అయితే, గాలి గట్టిగా వీయడంతో వాయిస్ రికార్డర్‌కు ఆ శబ్దం వినబడలేదు. దీంతో మరో మూడు సెకండ్లు ఉందనగా.. రుద్ర మళ్లీ గట్టిగా అరిచి రెండో పజిల్ ఆన్సర్ చెప్పాడు. టైమ్ పూర్తయ్యింది. తాను చెప్పిన ఆన్సర్లు కరెక్ట్.. అవునా? కాదా? అని రుద్రతో పాటు అందరూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు.

రెండు నిమిషాల తర్వాత మరో డ్రోన్ అక్కడికి వచ్చి ఓ లెటర్‌ను కిందకు విసిరేసింది. 'బ్రిలియంట్ రుద్ర. నా రెండు పజిల్స్‌కు నువ్వు కరెక్ట్‌గా ఆన్సర్ చేశావ్. సో.. ఆపరేషన్ దుర్గం చెరువు సక్సెస్. ఇక ఈ పిల్లాడిని నువ్వు తీసుకెళ్లొచ్చు. అయితే, ఈ పిల్లాడిని నువ్వు వాళ్ల ఇంటికి తీసుకెళ్తావా? లేక శ్మశానానికా? మరిన్ని వివరాల కోసం.. నీ మొబైల్‌లో మెసేజ్ చూడు' అని ఆ లెటర్‌లో ఉంది. అది చదవగానే రుద్ర కాళ్లకింద భూకంపం వచ్చినంత పనైంది. అంతలోనే ఓ ఇంటర్నెట్ స్పామ్ నంబర్ నుంచి అప్పుడే రుద్ర ఫోన్‌కు మెసేజీ డెలివరీ అయ్యింది. కంగారుగా ఓపెన్ చేశాడు రుద్ర 'హాయ్ రుద్రా.. టెన్షన్ అంటే ఏంటో మొదటిసారి చూస్తున్నావా? ఇది జస్ట్ ఫస్ట్ రౌండ్ మాత్రమే. అసలు ఆట ముందు ఉంది. ఈ పిల్లాడికి నేను ఓ ఇంజెక్షన్ ఇచ్చా. అయితే, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా నేను ఆ బాబు ఒంట్లోకి ఎక్కించలేదు. అయినప్పటికీ కొద్దిసేపట్లో అతను చనిపోతాడు. అసలేం జరిగిందో టెస్టులు చేసి డాక్టర్లు తెలుసుకొనే లోపే పిల్లాడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అందుకే, ఈ బాబును డైరెక్టుగా శ్మశానానికి తీసుకుపో.. లేదు. కాపాడతా అంటావా? అయితే, నా ఇన్ఫర్మేషన్‌లోనే ఆన్సర్ ఉంది. దమ్ముంటే కాపాడుకో' అని ఆ మెసేజీలో ఉంది. దీంతో కంగారు పడిపోయిన రుద్ర.. హుటాహుటిన పిల్లాడిని హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. టెస్టులకు సమయం పడితే, పిల్లాడి ప్రాణాలకే ప్రమాదం అని గ్రహించిన రుద్ర.. సైకో ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌ను డీకోడ్ చేసి అసలు సమస్యేంటో డాక్టర్స్‌కు చెప్పాడు. దీంతో ఆ డైరెక్షన్‌లోనే టెస్టులు చేసిన వైద్యులు సమస్య అదే అని కనిపెట్టారు. సకాలంలో వైద్యం చేయడంతో పిల్లాడు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇంతకీ, సైకో అడిగిన రెండు పజిల్స్‌కు సమాధానమేంటి? పిల్లాడికి సైకో ఏ ఇంజెక్షన్ ఇచ్చినట్టు? దాన్ని రుద్ర ఎలా కనిపెట్టినట్టు??

**సమాధానం:** మొదటి పజిల్‌లో సునందకు నలుగురు కూతుళ్లు అని సైకో చెప్పాడు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ అని కూడా చెప్పాడు. అంటే ఈ లెక్కన సునందకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. అంటే సునందకు మొత్తం ఐదుగురు సంతానం. మూడో వ్యక్తి ఐదుగురు అన్నాడు. అంటే అతనే పిల్లాడి తండ్రి. ఇక, రెండో పజిల్‌లో కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప అని సైకో అడిగాడు. ఎడమ చెయ్యి తన మోచేతిని తాకలేదు. అయితే, కుడి చెయ్యి ఎడమ చెయ్యి మోచేతిని తాకగలదు. ఇదే ఆన్సర్. దీన్ని రుద్ర కరెక్ట్‌గా చెప్పాడు. ఇక, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా లేని ఇంజెక్షన్‌ను పిల్లాడికి ఇచ్చానని సైకో చెప్పాడు. అంటే పిల్లాడికి సైకో ఎయిర్ ఎంబ్లాయిజమ్ (రక్త నాళాల్లోకి గాలిని ఎక్కించడం) చేశాడని రుద్ర కనిపెట్టాడు. డాక్టర్లకు ఆ విషయాన్ని చెప్పడంతో సకాలంలో చికిత్స అంది పిల్లాడు బతికి బయటపడ్డాడు.

# దొంగ నోట్ల మోసం ఛేదించిన పోలీసులు

"లక్ష ఇస్తే మూడు లక్షల బ్లాక్ మనీ" అంటూ

మోసం చేసిన నిందితుడు..


పోలీసుల అదుపులో నిందితుడు వెంకటేష్






వెల్దుర్తి / క్రిష్ణగిరి మే23 (అఖండ భూమి) : దొంగ నోట్ల వ్యవహారం స్థానికంగా కలకలం రేపింది. తక్కువ మొత్తానికి ఎక్కువ డబ్బు ఇస్తానంటూ ఆశ చూపించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సి బెళగల్ మండలం బాతోలి గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి "లక్ష రూపాయలు ఇస్తే మూడు లక్షల బ్లాక్ మనీ ఇస్తాను" అంటూ బాధితుడిని నమ్మించి మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, ఎస్సై కృష్ణమూర్తి వెల్లడించారు. వారి కథనం ప్రకారం, వెంకటేశ్వర్లు అక్రమ మార్గంలో అధిక మొత్తంలో డబ్బు ఇస్తానని చెప్పి బాధితుడిని ఆకర్షించాడు. అతని మాటలను నమ్మిన బాధితుడు నగదు ఇచ్చిన అనంతరం వెంకటేశ్వర్లు అందించిన నోట్లను పరిశీలించగా అవి దొంగ నోట్లు అని గుర్తించాడు. తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వేగంగా స్పందించి నిందితుడు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి దొంగ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ యుగంధర్ మాట్లాడుతూ, "సి బెళగల్ మండలం బాతోలి గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వర్లును రిమాండ్‌కు తరలించాం. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు వస్తుందనే ఆశతో ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తుల మాటలను ప్రజలు నమ్మకూడదు. ఎవరైనా అనుమానాస్పదంగా డబ్బు మార్పిడి చేయాలని ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని సూచించారు. ఈ ఘటనపై పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


## మందుల దుకాణాల్లో గడ్డి మందు అమ్మకాలు నిలిపివేయాలి ఏవో రామమ్మ



**మాచవరం మే 23 (అఖండ భూమి న్యూస్):** మాచవరం మండలంలో పురుగుల మందు ల దుకాణాల్లో 60 రోజులపాటు గడ్డి మందు అమ్మకాలు నిలిపివేయాలని మండల వ్యవసాయ అధికారి కే రామమ్మ సంబంధిత డీలర్లకు సూచించారు. శనివారం మాచవరంలోని పలు ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు .ఈ సందర్భంగా ఏవో రామమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అత్యంత విషపూరితమైన పారాక్వాట్ డిక్లోరైడ్ 24 గడ్డి మందు నిల్వ అమ్మకాలు మరియు వాడకాన్ని నిలిపివేయాలని సూచించారు. ప్రజారోగ్య ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఈ గడ్డి మందును అమ్మకాలు నిలిపివేయాలని ప్రభుత్వ సూచించింది అన్నారు .దాని అనుబంధ రూపాలు కూడా అమ్మకాలు పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. వైద్య మరియు ఫోరెన్సి కు నివేదికల ప్రకారం ఈ రసాయనం అత్యంత ప్రమాదకరమైందని దీనికి ఎటువంటి విరుగుడు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతంలో మానవ ప్రాణాలను తీవ్ర ముప్పుగా మారిందని ప్రభుత్వం నిర్ధారించినన్నారు. పురుగుమందుల చట్టం 1968 లోని సెక్షన్ 27 ప్రకారం 2026 మే 22 నుండి అమల్లోకి వచ్చేలా 60 రోజులు పాటు దీన్ని తాత్కాలికంగా నిషేధిస్తున్నామన్నారు. అన్ని ఎరువుల విత్తనాల మరియు పురుగుమందుల డీలర్లు డిస్ట్రిబ్యూటర్లు గడ్డి మందు అమ్మకాలు ప్రదర్శన తక్షణమే నిలిపివేయాలన్నారు. 48 గంటల్లో

## చిట్టింపాడు లో నలుగురికి మలేరియా జ్వరాలు

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు .



**కొయ్యూరు, అల్లూరి జిల్లా మే 23 (అఖండ భూమి న్యూస్):** కొయ్యూరు మండలంలోని చిట్టింపాడు పంచాయితీ పరిధిలో ముమ్మరంగా మలేరియా జ్వరాలు ప్రబలటంతో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. ఈ మేరకు డౌనూరు వైద్యాధికారి వినయ్, ఎంపీహెచ్ ఈ ఓ సిబ్బంది స్థానిక సచివాలయం వద్ద జ్వరాలు ప్రబలిన పలువురికి పరీక్షలు జరిపి వైద్యం అందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నట్టు డాక్టర్ వినయ్ తెలిపారు. కొయ్యూరు మండలం పరిధిలో ఉన్న చిట్టింపాడు తో పాటు గోపవరం,రామన్నపాలెం, గదబపాలెం, మల్లవరం,లింగాపురం తదితర గ్రామాల్లో మూడు రోజులుగా జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వీరిలో చిట్టింపాడు లో నలుగురుకి మలేరియా ప్రభావం ఉండటంతో గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నట్టు వైద్యాధికారి వినయ్ తెలిపారు. అలాగే జ్వరాలు ప్రభావం ఉన్న గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సహాయం అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం వేసవి ఎండలు ఎక్కువగా ఉండటంతో. పాటు గ్రామాల్లో ఎక్కువ మంది జీడి తోటల్లో పనులకు వెళ్ళిన వారికి, వేసవి తీవ్రత ఉష్ణోగ్రత పెరిగి వాతావరణంలో మార్పులు కారణంగా మరింత మందికి సాధారణ జ్వరాలే ఉన్నట్టు వైద్యాధికారి తెలిపారు. మూడు రోజులగా వైద్య పరీక్షలు జరిపి వారికి రక్త పరీక్షలు చేస్తూ మలేరియా జ్వరాలు గుర్తిస్తున్నట్టు తెలిపారు.చిట్టింపాడు లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలి. సర్పంచ్ నెమల నుకాలమ్మ డిమాండ్.వారం రోజులుగా నలుగురుకి తీవ్ర మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారితో పాటు పలు శివారు ప్రాంతాల్లో ఉన్న వారు మలేరియా జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో చిట్టింపాడు లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యం అందించాలని సర్పంచ్ నెమల నుకాలమ్మ డిమాండ్ చేశారు.

## కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం

పత్తికొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న చక్రాల గ్రామానికి విచ్చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్.





**పత్తికొండ మే23 మే 23 (అఖండ భూమి న్యూస్):** పత్తికొండ మండలం చక్రాల గ్రామం లో ఏబీవీపీ పూర్వపు విద్యార్థి నాయ కుడు కరీంనగర్,నిజామాబాద్ ప్రాంతా లలో ఏబీవీపీ ఫుల్ టైం వర్కర్‌గా పనిచే సిన చక్రాల సుధాకర్ అమ్మగారికి ఆరో గ్యం బాగాలేకపోవడంతో ఆమెను పరా మర్శించేందుకు కేంద్ర హోంశాఖ సహా య మంత్రి శనివారం చక్కరాల్ల గ్రామా నికి వచ్చారు.ఈ సందర్భంగా పత్తికొండ బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరే ష్ కేంద్రమంత్రి బండి సంజయ్ ను మ ర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలి కారు.కార్యకర్తల కష్టసుఖాలలో భాగ స్వామ్యం అవుతూ,వారి కుటుంబ స భ్యులను పరామర్శించేందుకు ప్రత్యేకం గా గ్రామానికి రావడం బండి సంజయ్ సేవాభావానికి నిదర్శనమని కొనియా డారు.కార్యకర్తల పట్ల బీజేపీ నాయక త్వం చూపుతున్న ఆప్యాయత, అంకిత భావం కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు.పత్తికొండ డి ఎస్పి.వెంకట్రామయ్యగట్టి పోలీసు బం దోబస్తు నిర్వహించారు ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ స్థులు నవీన్ రెడ్డి.బ్రహ్మయ్య.దండి మ ల్లికార్జున,టైలర్ లక్ష్మన్న.రామాంజనే యులు.సిసి.రంగన్న.గోవర్ధన్ నాయు డు.లక్ష్మణస్వామి.రంగయ్య.వీరేష్.హరీ ష్ నాయక్.గోరంట్ల.కరణం చంద్రన్న.తం బలనాగేష్.సురేంద్ర.రవిచంద్ర.టిడిపి నా యకులు ఎంపీటీసీ రాజు.మునినాయు డు.బిటి.పవన్.తదితరులు పాల్గొన్నా రు.

## ఏలేశ్వరంలో పార్య పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం, మే 23 (అఖండ భూమి న్యూస్):** 2026–-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఏలేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఈ స్టాక్ పాయింట్‌ను ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియను సమయానికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థుల అవసరాలు సమయానికి చేరేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు.పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.అదేవిధంగా యూనిఫాంలు,షూలు కూడా పాఠశాల ప్రారంభానికి ముందే అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో 2 వెల్లడించారు.

## ఎండ తీవ్రతకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డాక్టర్ అన్వేష్



**మాచవరం మే 23 (అఖండ భూమి న్యూస్):** గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ అన్వేష్ సూచించారు. శనివారం వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఈ వేసవికాలంలో చిన్నారులు వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని ఎండా తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎవరు బయటకు రాకూడదన్నారు అవసరం ఉంటేనే బయటికి రావాలని అప్పుడు కూడా గొడుగు తమ వెంట త్రాగునీరు తీసుకురావాలన్నారు. అలాగే వరదప్ప తగలకుండా ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటించాలన్నారు ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో నివాసంలోని కిటికీలకు పరదా పట్టణ కట్టి ఎప్పటికప్పుడు నీటిని చల్లుతూ ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు వైద్యులు ఉన్నారని ఇటువంటి ఇబ్బందులు వచ్చిన నేరుగా వైద్యశాలకు రావచ్చునని ఆయన సూచించారు ఈ పది రోజులు పాటు జాగ్రత్తలు పాటిస్తే అనంతరం ఎటువంటి ఇబ్బందులు ఉండవని డాక్టర్ అన్వేష్ అన్నారు అలాగే గ్రామాల్లోని హెల్ప్ సెంటర్ లో కూడా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ప్రజలు కావాలంటే ఏఎన్ఎం లను ఆశ వర్కర్లు అడిగి తీసుకోవాలన్నారు అలాగే గ్రామాల్లో మీ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకుంటే దోమల ప్రభులే అవకాశం ఉందన్నారు

## దళిత మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

పాయకరావుపేట ఘటనపై వైఎస్సార్సీపీ మహిళా నేత వర్ధినీడి సుజాత ఆగ్రహం



**పిఠాపురం, మే 23 (అఖండ భూమి న్యూస్):** పాయకరావుపేటలో దళిత బాలికపై జరిగిన లైంగిక దాడి ప్రయత్న ఘటన రాష్ట్రంలో దళిత మహిళల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని కాకినాడ జిల్లా వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యంగా దళిత మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆరోపించారు.హోంమంత్రి అనిత నియోజకవర్గమైన పాయకరావుపేటలో 11 ఏళ్ల దళిత బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు.సెల్‌ఫోన్ దొంగిలించిందని ఆరోపిస్తూ బాలికను ఈ నెల 17న కొబ్బరి తోటకు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడం అమానుషమని పేర్కొన్నారు.బాలిక ప్రైవేట్ భాగాలను తాకుతూ గోర్లతో గాయపరిచిన ఘటన అత్యంత హేయమైనదని అన్నారు.ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందన కనిపించకపోవడం బాధాకరమన్నారు.ఒక దళిత మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలపై కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.తునిలో ఇటీవల జరిగిన ఘటనను గుర్తు చేస్తూ,రాష్ట్రంలో పిల్లలు,ముఖ్యంగా దళితులపై జరుగుతున్న దాడుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డికు దళితులు మద్దతుగా ఉన్నారనే కారణంతో వారిపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత బాలికకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

## గంజాయి రవాణా కేసులో ప్రధాన ముద్దాయి అరెస్ట్

సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు



**కొయ్యూరు అల్లూరు జిల్లా మే 23 (అఖండ భూమి న్యూస్):** మంప పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న ఏ -2 ముద్దాయి భట్టి ప్రభాకర్ రావును అరెస్టు చేసినట్లు కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసరావు అందజేసిన వివరాల ప్రకారం... ఈ నెల రెండున బూదరాళ్ల గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తూ టిఎన్ 09 బిఎస్ 9491 కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 90 కేజీల గంజాయిని కనుగొని స్వాధీన పరుచుకున్నారు. కారుతో పాటు గంజాయిని స్వాధీన పరుచుకున్న పోలీసులు గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులైన శివాంగ్ దీక్షిత్, సమరెడ్డి చందుబాబు లను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులైన బట్టి ప్రభాకర్ రావు తమిళనాడుకు చెందిన సుకుమార్ పరారీలో ఉండటంతో వారి ఆచూకీకై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ముద్దాయి ప్రభాకర్ రావు గతంలో తమిళనాడులో గంజాయి కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించడం జరిగిందని తెలిపారు. అక్కడ ఏర్పడిన పరిచయాల ద్వారా ఒడిస్సా రాష్ట్రం నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు సరఫరా చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసుల నిఘా పెరగడంతో ఒడిస్సా అడవుల్లో తలదాచుకున్న నిందితుడు చెన్నై పారిపోవడానికి కాకరపాడు జంక్షన్ వద్ద వాహనం కోసం వేచి ఉండగా తమకు అందిన సమాచారంతో దాడి చేసి అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, గంజాయి స్మగ్లర్లకు సహకరించడం చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్సై సీదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.ం



## హిట్ తో కాదు ఫ్లాప్ తో కలిసొచ్చిందన్న నటి!

సక్సెస్ కంటే వైఫల్యాల నుంచే ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. విజయం అనే మత్తు నుంచి గర్వం తలకెక్కుతుంది? అదే వైఫల్యం ఎన్నో విషయాలు అర్థమయ్యేలా చేస్తుంది. మనిషిలో కసి , పట్టుదలను పెంచుతుంది. తదుపరి తప్పిదాలు దొర్లకుండా జాగ్రత్త పడేలా చేస్తుంది. -మస్తీ 4- ఫ్లాప్ నుంచి ఎల్నాజ్ నౌరోజీ ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపింది. భారీ అంచనాల మధ్య బాలీవుడ్ చిత్రం -మస్తీ 4- రిలీజ్ అయినా వాటిని అందుకోవడంలో విఫలమైంది. కానీ నటిగా తనను తాను మరింత మెరుగు పరుచుకోవడానికి ఆ వైఫల్యం ఎంతో దోహదం చేసిందంది. ాశ్రీంశీ =ఋ౹ం - రోషన్ ధైర్యానికి ఫలితం? ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా? అందులో తాను పోషించిన పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయంది. 'కామెడీ సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. 'మస్తీ 4' తో ఆ కల తీరిపోయింది. కామెడీ కూడా చేయగలనని ఆ సినిమా నాలో ఉత్సాహాన్ని నింపింది. 'సీక్రెడ్ గేమ్స్', 'అభయ్' లాంటి చిత్రాల్లో సీరియస్ పాత్రలు పోషించాను. -రాణ్నీతి-లో ఇంకా సీరియస్ రోల్ పోషించాను. ఈ క్రమంలో -మస్తీ 4- చేసాను. ఈ సినిమా వైఫల్యం చెందిందని బాధ పడుతూ కూర్చోలేదు. ఎందుకంటే సినిమా సక్సెస్ కి ఎన్నో అంశాలు కలిసి రావాలి. ాశ్రీంశీ =ఋ౹ం - గూండాలా ఉన్నాడనే సినిమాల్లో రౌడీ వేషాలు! అలా కుదరనప్పుడు? విజయం సాధించవు. నటిగా తన బాధ్యత నటించడం సక్సెస్ అన్నది ప్రేక్షకులు ఇవ్వాల్సింది. ఫెయిలైంది అన్న బాధ రెండు రోజులుంటుంది. ఆ తర్వాత అంతా మామూలుగానే ఉంటుంది. ఈ సినిమా విషయంలో ట్రోలింగ్ ను ఎంత మాత్రం పట్టించుకోలేదు. ఈ కాలంలో ట్రోలింగ్ అన్నది సహజంగా మారింది. హిట్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా చిన్న చిన్న విషయాలకే ట్రోలింగ్ జరుగుతుంది. ఇలాంటి నెగిటివిటీని పట్టించుకుంటే జీవితంలో ముందుకు వెళ్లలేం అని చెప్పుకొచ్చింది. ఓటీటీలోనే కాదు అవార్డులోనూ అదే జోరు -మస్తీ 4- ఫ్లాప్ తో లోపాలను గుర్తించాను. తర్వాత వాటిని ఎలా సరిదిద్దుకోవాలో ఆలోచించి ఓ నిర్ణయం తీసుకు న్నాను. కొన్ని సినిమాలకు ఆడియన్స్ నటీనటులపై నమ్మకంతో వస్తారు. అలాంటి వారిని సంతృప్తి పరచాల్సిన బాధ్యత నాపై అంతే ఉంటుంది. అందుకే తన పాత్ర వరకూ ప్రేక్షకుల్ని ఎప్పుడూ సంతోషంగా థియేటర్ నుంచి పంపించడానికి తన వంతు కృషి చేస్తానంది. ఈ ఇరానియన్ మోడల్ -హాలో చార్లీ- సినిమాతో బాలీవుఎడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత -జగ్ జగ్ జీయో-, -రాష్ట్ర కవచ్ ఓం- లాంటి చిత్రాల్లో నటించింది. మరాఠీ, పంజాబీ చిత్రాల్లోనూ నటించింది. టెలివిజన్ పైనా తనదైన ముద్ర వేసింది. -డెవిల్ :ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్- అనే తెలుగు సినిమాలోనూ నటించింది.



## మిస్టరీ కుక్కలతో వృద్ధురాలు.. నెట్‌ఫ్లిక్స్ లో ఈ సినిమా చూశారా?

ఇక కథ విషయానికి వస్తే.. కేరళ, కర్ణాటక బోర్డర్ లోని ఒక దట్టమైన అడవిలో ఒక వృద్ధురాలు ఒంటరిగా ఉంటుంది.

ఈ మధ్య కాలంలో చిన్న సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. కంటెంట్ ఉంటే చాలు బడ్జెట్ తో పనిలేదని నిరూపిస్తున్నాయి. సరిగ్గా ఇలాంటి కోవలోకే వస్తుంది మలయాళ చిత్రం 'ఎకో'. కేవలం 5 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా 50 కోట్లు వసూలు చేసిందట. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ లో తెలుగులో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. 'కిష్కింధకాండం' లాంటి మిస్టరీ థ్రిల్లర్ ను అందించిన దింజిత్ అయ్యతన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. మలయాళ సినిమాలు ఇష్టపడే వారికి ఈయన మేకింగ్ స్టైల్ మీద ఒక ఐడియా ఉంటుంది. ఈసారి కూడా అలాంటి ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తోనే వచ్చారు. అడవి నేపథ్యంలో సాగే ఈ కథలో మనం ఊహించని ట్విస్టులు ఉంటాయని చూసిన వారు చెబుతున్నారు. రొటీన్ ఫార్మాట్ కు దూరంగా సాగే కథనం దీని ప్రత్యేకత. రోషన్ ధైర్యానికి ఫలితం? ఇక కథ విషయానికి వస్తే.. కేరళ, కర్ణాటక బోర్డర్ లోని ఒక దట్టమైన అడవిలో ఒక వృద్ధురాలు ఒంటరిగా ఉంటుంది. ఆమెకు తోడుగా కొన్ని భయంకరమైన కుక్కలు ఉంటాయి. తప్పించుకు తిరుగుతున్న ఆమె భర్త కోసం పోలీసులు వెతుకుతుంటారు. అసలు ఆ బామ్మ అక్కడ ఎందుకుంది, ఆ కుక్కల వెనుక ఉన్న మిస్టరీ ఏంటి అనేది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్ సింపుల్ గా అనిపించినా ట్రీట్ మెంట్ కొత్తగా ఉందని అంటున్నారు. సినిమా చూసిన ఆడియన్స్ నుంచి వినిపిస్తున్న ప్రధానమైన పాజిటివ్ పాయింట్ క్లైమాక్స్. చివరి అరగంట సినిమాకు ప్రాణం పోసిందని అంటున్నారు. ముఖ్యంగా కుక్కలకు సంబంధించిన సన్నివేశాలు భయాన్ని పుట్టిస్తాయని, ఆ సౌండ్ డిజైన్ కూడా బాగుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి. సస్పెన్స్ ను చివరి వరకు మెయింటైన్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడని మెజారిటీ వర్గాల అభిప్రాయం. హిట్ తో కాదు ఫ్లాప్ తో కలిసొచ్చిందన్న నటి! అయితే ప్రతి మలయాళ సినిమాకు ఉండే చిన్న కంప్లైంట్ దీనికి కూడా ఉంది. కథనం చాలా నెమ్మదిగా సాగుతుందని, ఫాస్ట్ పేస్ కోరుకునే వారికి అక్కడక్కడ బోర్ కొట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. క్యారెక్టర్ల ఎస్టాబ్లిష్ మెంట్ కు ఎక్కువ టైమ్ తీసుకోవడం, కొన్ని చోట్ల లాగ్ అనిపించడం మైనస్ గా చెబుతున్నారు. కానీ థ్రిల్లర్ జానర్ ఇష్టపడే వారికి ఈ స్లో నరేషన్ పెద్దగా ఇబ్బంది పెట్టకపోవచ్చు. మొత్తానికి ఎకో ఒక డీసెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ అని పబ్లిక్ టాక్. ఎలాంటి అంచనాలు లేకుండా చూస్తే మంచి థ్రిల్ ఇస్తుందని అంటున్నారు. ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ క్లీన్ కంటెంట్ కావడం, తెలుగు ఆడియో కూడా అందుబాటులో ఉండటంతో ఈ వీకెండ్ వాచ్ లిస్ట్ లో చేర్చుకోవచ్చు. కమర్షియల్ హంగులు ఆశించకుండా ఒక మంచి మిస్టరీ కథను చూడాలనుకునే వారికి ఇది బెస్ట్ ఆప్షన్.



## బయ్యర్లకు బోయపాటి హామీ ఇచ్చారా?

ఈ నేపథ్యంలో బయ్యర్లు తమ నష్టాల వివరాలు దర్శకుడు బోయపాటి శ్రీనుకు వివరించినట్లు సమాచారం. ఏ ప్రాంతంలో ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత మొత్తం తిరిగి వచ్చింది

టాలీవుడ్ మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను తెరకెక్కించిన అఖండ 2: తాండవం రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ లీడ్ రోల్ లో నటించిన ఆ సినిమా.. డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ అఖండకు సీక్వెల్ గా రూపొందింది. దీంతో భారీ అంచనాల మధ్య సినిమా రిలీజ్ అయినా.. వాటిని అందుకోలేదని చెప్పాలి. బాలయ్య అభిమానులను మూవీ మెప్పించినా.. కామన్ ఆడియన్స్ కు అంతగా ఆకట్టుకోలేదు. వసూళ్లు మొదట్లో కాస్త స్ట్రాంగ్ గా వచ్చినా.. ఆ తర్వాత డౌన్ అయిపోయాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని అనేక చోట్ల సినిమా బ్రేక్ ఈవెన్ టార్గెట్ ను అందుకోలేదు. రోషన్ ధైర్యానికి ఫలితం? కొన్ని చోట్ల 50 శాతం కూడా రికవరీ కూడా అవ్వలేదని సమాచారం. దీంతో అనేక బయ్యర్లు ఇప్పుడు లాస్ జోన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు వారంతా బోయపాటి శ్రీను తాజాగా కలిసినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అఫీషియల్ గా ఆ విషయం తెలియక పోయినా.. కలవడం మాత్రం నిజమేనని ఇప్పుడు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బయ్యర్లు తమ నష్టాల వివరాలు దర్శకుడు బోయపాటి శ్రీనుకు వివరించినట్లు సమాచారం. ఏ ప్రాంతంలో ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత మొత్తం తిరిగి వచ్చింది, ఎంత నష్టం మిగిలిందన్న అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారని ప్రచారం జరుగుతోంది. దీనిపై బోయపాటి శ్రీను సానుకూలంగా స్పందించారట. హిట్ తో కాదు ఫ్లాప్ తో కలిసొచ్చిందన్న నటి! తాను చేయగలిగినంత సహాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు సినీ వర్గాల సమాచారం. అంతేకాదు, సినిమా విడుదలకు మద్దతుగా నిలిచిన మ్యాంగో రామ్ తో మాట్లాడాలని బయ్యర్లను కోరినట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో జీఎస్టీ భాగాన్ని ఇప్పిస్తానని చెప్పారట. బిజినెస్ పరంగా ఆశించిన స్థాయిలో వసూళ్లు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పాలి. అయితే కొంతమంది బయ్యర్లు కలిసి ఇప్పుడు మ్యాంగో రామ్ ను కలిసే అవకాశం ఉందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఆ మీట్.. కచ్చితంగా జరుగుతుందా లేదా అన్న విషయంపై అధికారిక సమాచారం మాత్రం లేదు. మ్యాంగో రామ్ ఆ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కూడా ఎవరూ చెప్పలేం. నిజానికి.. అఖండ 2 రిలీజ్ కు ముందు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఆ సమయంలో మ్యాంగో రామ్ రంగంలోకి దిగి సహాయం చేశారు. దీంతో ఆయనకు సినిమా ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉందన్న ప్రచారంలో ఉంది. ఏ ఏ ప్రాంతాల్లో హక్కులు ఎంతకు అమ్మారో, ఎంత మొత్తాన్ని రికవర్ చేసుకున్నారో, ఎంత నష్టం వాటిల్లిందన్న వివరాలన్నీ ఆయనకు తెలిసి ఉండవచ్చు. అందుకే బయ్యర్లను బోయపాటి ఆయనను సంప్రదించమని సూచించారని సమాచారం.

## ఎన్టీఆర్ కోసం నీల్ ఫస్ట్ టైమ్ ఇలా...!



ఎన్టీఆర్ అండ్ నీల్ సినిమాల్లో ఇదొక యాక్షన్ ఎపిక్ అని ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్, మలయాళ స్టార్ టొవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'డ్రాగన్'. క్రేజీ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో ఈ యాక్షన్ డ్రామాని నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, హాలీవుడ్ టెక్నీషియన్స్‌తో దీన్ని రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ అండ్ నీల్ సినిమాల్లో ఇదొక యాక్షన్ ఎపిక్ అని ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్, మలయాళ స్టార్ టొవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ాశ్రీంశీ =ఋ౹ం - రోషన్ ధైర్యానికి ఫలితం? కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదొక ఎపిక్ యాక్షన్ సాగా. సున్నితమైన భావోద్వేగాలకు రా అండ్ రస్టిక్ యాక్షన్ సన్నివేశాలని జోడించి దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో ఎన్టీఆర్ ఇంత వరకు చేయని, ఊహించని పవర్‌ఫుల్ పాత్రలో బీస్ట్‌గా కనిపిస్తాడని తెలుస్తోంది. ఇక స్టోరీ నేపథ్యం 1969లో చైనా, భూటాన్, ఇండియా గోల్డెన్ ట్రయాంగిల్ సరిహద్దుగా పిలిచే ప్రాంతం చుట్టూ సాగుతుందని ఇన్ సైడ్ టాక్. పీరియాడిక్ ఫిక్షనల్ స్టోరీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ాశ్రీంశీ =ఋ౹ం - హిట్ తో కాదు ఫ్లాప్ తో కలిసొచ్చిందన్న నటి! ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ ల ఫస్ట్ కాంబినేషన్ అనగానే ఈ మూవీపై అంచనాలు తారా స్థాయికి చేరాయి. దానిపై మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఈ మూవీ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో ఉంటుందని, ఇది ప్రత్యేకమైన స్క్రిప్ట్ అని, ఇంత వరకు ఇండియన్ సినిమాల్లో చూడని యునిక్ స్టోరీ అని, దీనికి ఆకాశమే హద్దు అన్నారు. అంతే కాకుండా ఈ మూవీ ఎలా ఉంటుందన్నది మీ ఊహకు కూడా అందదని, అంచనాలకు మించి ఉంటుందని హైప్ ఇచ్చారు. దానికి ఏమాత్రం తగ్గని స్థాయిలో సినిమా షూటింగ్ జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ాశ్రీంశీ =ఋ౹ం - గూండాలా ఉన్నాడనే సినిమాల్లో రౌడీ వేషాలు! కొంత విరామం తరువాత తిరిగి షూటింగ్ ప్రారంభం అయిన ఈ మూవీ కోసం ఫస్ట్ టైమ్ భారీ స్థాయిలో హైదరాబాద్ పరిసరాల్లో సెట్‌ని నిర్మించి అందులో షూటింగ్ చేస్తున్నారట. ప్రశాంత్ నీల్ సినిమాల్లో భారీ సెట్‌లని నిర్మించడం అనేది చాలా అరుదు. కేజీఎఫ్ నుంచి సలార్ వరకు ఎలాంటి సెట్‌లు వాడకుండా రియల్ లొకేషన్‌లలోనే షూటింగ్ చేశారు. కానీ ఫస్ట్ టైమ్ ఎన్టీఆర్ 'డ్రాగన్' కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌లో సెట్ వేయడం ఆసక్తికరంగా మారింది. తాజాగా నిర్మించిన భారీ సెట్‌లో నెల రోజుల పాటు షూటింగ్ చేయనున్నారట. ాశ్రీంశీ =ఋ౹ం - ఓటీటీలోనే కాదు అవార్డులోనూ అదే జోరు ఇందులో ఎన్టీఆర్‌పై పలు కీలక ఘట్టాలని షూట్ చేస్తారని ఇన్ సైడ్ టాక్. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సెట్ వేయడమే ఫస్ట్ టైమ్ అంటే అది కూడా తెలుగు స్టేట్‌లోని హైదరాబాద్‌లో వేయడం తొలి సారని చెబుతున్నారు. రుక్మిణీ వాసంత్ తో పాటు కయదు లోహర్ కూడా మరో హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని, పవర్‌ఫుల్ క్యారెక్టర్లలో అనిల్ కపూర్, మలయాళ స్టార్ టొవినో థామస్ నటిస్తున్నారని, ఎన్టీఆర్‌పై షూట్ చేసే యాక్షన్ ఘట్టాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది

## దీపిక బర్త్ డే స్పెషల్.. తెలుగు ఫేవరెట్ హీరో ఎవరంటే?

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ అందుకొని.. కెరియర్లో ఒక్కో మెట్టు ఎదుగుతూ నేడు టాప్ మోస్ట్ హీరోయిన్ గా పేరు దక్కించుకుంది దీపికా పదుకొనే. ఈరోజు ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన కొన్ని విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. 2006లో ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వం వహించిన కన్నడ సినిమా 'ఐశ్వర్య' ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఈ సినిమా తెలుగు చిత్రం మన్మథుడుకి రీమేక్. ఇందులో ఉపేంద్ర హీరోగా నటించారు. ఈ సినిమా కమర్షియల్ గా మంచి విజయం సాధించింది. ాశ్రీంశీ =ఋ౹ం - రోషన్ ధైర్యానికి ఫలితం? ఇక తర్వాత 2007లో ఓం శాంతి ఓం అనే సినిమా ద్వారా బాలీవుడ్ సినీ రంగ ప్రవేశం చేసింది. అక్కడ తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఏకంగా మూడు ఫిలింఫేర్ అవార్డులు దక్కించుకుంది. ఇకపోతే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకోవడమే కాకుండా అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా కూడా పేరు సంపాదించింది. ప్రస్తుతం ఒక్కో చిత్రానికి 15 నుండి 20 కోట్లు తీసుకుంటున్న ఈమె బాలీవుడ్ లోనే కాదు తెలుగులో కూడా సినిమాలు చేస్తోంది. హిట్ తో కాదు ఫ్లాప్ తో కలిసొచ్చిందన్న నటి! అలా తొలిసారి కల్కి 2898ాణ చిత్రంలో కనిపించింది. అక్కడ తన అద్భుతమైన నటనతో యాక్షన్ పర్ఫామెన్స్ తో అందరి దృష్టిని ఆకర్షించింది దీపికా పదుకొనే. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా ప్రముఖ కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో వస్తున్న ాూూ 22 ఇూ6 అనే సినిమాలో నటిస్తోంది. హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ సంస్థలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయి. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ భారీ బడ్జెట్లో నిర్మిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొనే హీరోయిన్గా నటిస్తోంది. గూండాలా ఉన్నాడనే సినిమాల్లో రౌడీ వేషాలు! ఇదిలా ఉండగా ప్రస్తుతం తెలుగు సినిమాలలో అవకాశాలు అందుకుంటున్న ఈమెకు.. తెలుగులో ఉన్న స్టార్ హీరోలు అందరి కంటే ఆ హీరో అంటే చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. అసలు విషయంలోకి వెళ్తే.. అర్జున్ కపూర్ హీరోగా, దీపికా పదుకొనే హీరోయిన్గా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఫైండింగ్ ఫెనీ. ఈ సినిమా ప్రమోషన్ కోసం హైదరాబాద్ కి వచ్చిన ఈమె టాలీవుడ్ లో తన ఫేవరెట్ హీరో గురించి చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది ఆమె మాట్లాడుతూ..“ తెలుగులో నాకు ఇష్టమైన హీరో మహేష్ బాబు. తెలుగు సినిమాలలో నటించాలని నేను గతంలో చాలా ఎదురు చూశాను. కానీ ఇప్పుడు అవకాశాలు వస్తున్నా.. నాకు సమయం లేక నటించడం లేదు అంటూ చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు మాత్రం వరుసగా తెలుగులో అవకాశాలు అందుకోవడమే కాకుండా అందులో నటిస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది దీపిక పదుకొనే. ఇక దీపికా పదుకొనేకి మహేష్ బాబు ఇష్టమని తెలియడంతో అటు మహేష్ బాబు అభిమానులు కూడా ఈమెకు మద్దతుగా నిలుస్తున్నారు



Editor, Printed, Published and Owned by“MASAPOGU ESWARAIAH ,“H.No - 77/1361-E-2-2-E, Faruk Nagar, (Srinivasa Nagar), Aditya Nagar, Kallur Estate, Kallur(M), Kurnool Dist-518003, Andhra Pradesh, R N I , APTEL 2 0 2 2 / 8 4 0 4 2“Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A, BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP. E-mail : akhandabhoomitelugudaily@gmail.com, Cell : +91 9440912389, 9490315559